తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
మెదక్ - మహబూబ్‌నగర్
సంగారెడ్డి | సిద్దిపేట
జోగులాంబ గద్వాల
వనపర్తి | నారాయణపేట
నాగర్ కర్నూల్
మంగళవారం
24 నవంబర్ 2026
Follow :

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- **అర్హులందరూ నమోదు చేసుకోవాలి: మంత్రి వాకిటి శ్రీహరి**



మక్తల్, నవంబర్ 23 (జనంసాక్షి): పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర క్రీడా, పాడి పరిశ్రమాభివృద్ధి, పశు సంవర్ధక, మత్స్య, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పిలుపునిచ్చారు.

మక్తల్ పట్టణంలోని 8వ వార్డులో నిర్వహిస్తున్న పథకం నమోదు కార్యక్రమాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ ప్రియాంకతో కలిసి మంత్రి పరిశీలించారు. లబ్ధిదారుల నమోదు ప్రక్రియ, అర్హత వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కుటుంబానికి అండగా ఉండే వ్యక్తికి అనుకోని ప్రమాదం జరిగినప్పుడు ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా భరోసా కల్పించడమే పథకం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగిన వారు ఈ పథకానికి అర్హులని పేర్కొన్నారు. అర్హులందరూ తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు.

సంక్షేమ పథకాల ప్రయోజనాలు ప్రజలకు అందించడంలో జాప్యం జరగకుండా అధికారులు క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ఫలాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

కలెక్టర్ ప్రియాంక మాట్లాడుతూ... ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా నమోదు కార్యక్రమం నెల రోజుల పాటు కొనసాగుతుందని తెలిపారు. అనంతరం మంత్రి, కలెక్టర్ కలిసి పథకం పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

కస్తూర్బా గాంధీ
బాలికల విద్యాలయం తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



మాగనూర్ (జనంసాక్షి): మాగనూరు మండలం కస్తూర్బా గాంధీ పదవ తరగతి, ఇంటర్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక తెలిపారు. సోమవారం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం మాగనూరు సందర్శించి విద్యార్థుల విద్యా బోధన భోజనం తదితర అంశాలపై కలెక్టర్ తెలుసుకున్నారు. విద్యాలయం లో కాలేజీ స్టాఫ్ ఎంతమంది ఉన్నారని అడిగారు. వాష్రూమ్స్ బాగా ఉన్నాయా సమస్యలు ఏమున్నాయి అని అడిగి తెలుసుకున్నారు. సోలార్ హీటర్స్ ఉంటే బాగా ఉంటుంది అని టీచర్స్ కోరారు. స్టోర్ రూమ్ తనిఖీ చేసి కందిపప్పు బియ్యం సరుకులు పరిశీలించారు. రెండవ సంవత్సరం బైపిసి క్లాస్ ని తనకి చేసి విద్యార్థుల బోధన అంశాలను పరిశీలించారు. ఆన్లైన్ క్లాసెస్ ద్వారా ఖాన్ అకాడమీ తో బాగా చదవాలని కలెక్టర్ తెలిపారు. 2అ ఇయర్ మీరు క్లాస్ ని తనిఖీ చేసినారు. కష్టపడి చదువుకోవాలని అన్నారు. బైపిసి 1ర్ ఇయర్ ని తనిఖీ చేసినారు. డాక్టర్ అవ్వాలి అని కోరిన కలెక్టర్ నీట్ రాస్తే సీట్ వస్తుంది అన్నారు ఇప్పటి నుండి ప్రాక్టీస్ చేయండి అన్నారు హార్డవర్క్ చేసి చదువలి,ఫస్ట్ ఇయర్ లో ఎంతమంది ఉన్నారు అడిగి తెలుసుకుని ఎలా ఉందని విద్యార్థులు అడిగారు. ఫుడ్ కమిటీ ఉన్నదా మెనూ పాటిస్తున్నారా లేదా అని అడిగారు. కేజీబీవీ కాంపౌండ్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం బాలికల విద్య కొరకు ప్రత్యేకంగా కేజీబీవీ పాఠశాలలో కళాశాల నెలకొల్పి కోట్ల రూపాయల ఖర్చు చేసి విద్యాబోధన అందిస్తుందని ప్రతి విద్యార్థిని బాగా చదువుకొని జీవితంలో ముందుకు రావాలని కలెక్టర్ తెలిపారు. ముఖ్యంగా పదవ తరగతి ఇంటర్ ఫలితాలలో జిల్లాలు ముందు స్థాయిలో ఉంచేందుకు విద్యార్థినులు ఉపాధ్యాయులు కష్టపడాలని కలెక్టర్ తెలిపారు. పాఠశాలలో ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అధికారులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



నిమ్జ్ పారిశ్రామిక కారిడార్ పనులను పరిశీలించిన అదనపు కలెక్టర్



ఝరాసంగం, నవంబర్ 23 (జనంసాక్షి): జాతీయ పెట్టుబడుల ఉత్పాదక మండలి (నిమ్జ్) ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న పారిశ్రామిక కారిడార్‌లో భాగంగా చేపట్టిన మౌలిక సదుపాయాల కల్పన పనులను సోమవారం సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సంగీత పరిశీలించారు. పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలంగా చేపడుతున్న అంతర్గత రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి పైపులైన్లు, విద్యుత్ లైన్లు, నీటి ట్యాంకుల నిర్మాణ పనులను ఆమె క్షేత్రస్థాయిలో పర్యటించి పరిశీలించారు. పనుల పురోగతి ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంట నిమ్జ్ ప్రత్యేక అధికారి విశాలాక్షి, ఆర్డీవో దేవుజా, తహసీల్దార్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

- **అధికారులకు అదనపు కలెక్టర్ నగేష్ ఆదేశం**



మెదక్ బ్యూరో, నవంబర్ 23 (జనంసాక్షి): ప్రజావాణిలో ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ (రెవెన్యూ) నగేష్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. దరఖాస్తుల పరిష్కారంలో జాప్యం చేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

ఈ కార్యక్రమంలో మొత్తం 62 దరఖాస్తులు అందాయి. వీటిలో భూభారతి సమస్యలపై 20, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి 8, పింఛన్లపై 5, ఇతర సమస్యలపై 29 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారానికి ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో డీఆర్వో అంబాదాస్ రాజేశ్వర్, జెడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీఆర్డీఓ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సర్కారు ఆఫీస్‌కే 'అద్దె' తాళం!



కేటీదొడ్డి, నవంబర్ 23 (జనంసాక్షి): ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వ కార్యాలయానికే అద్దె కట్టలేని దుస్థితి దాపురించింది! గద్వాల జిల్లా కేటీదొడ్డి ఎంపీడీవో కార్యాలయానికి భవన యజమాని ఏకంగా తాళం వేయడం స్థానికంగా తీవ్ర సంచలనం రేపింది. గత కొన్ని నెలలుగా కార్యాలయ భవనానికి సంబంధించిన అద్దె బకాయిలను ప్రభుత్వం చెల్లించకపోవడంతో విసిగిపోయిన యజమాని ఈ కఠిన నిర్ణయం తీసుకున్నారు.ఒకవైపు కోట్ల రూపాయల ప్రజా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని గొప్పలు చెప్పుకుంటున్న పాలకులు, కనీసం మండల స్థాయి ప్రధాన కార్యాలయ అద్దె కూడా చెల్లించలేకపోవడం "అవురా!" అని ముక్కున వేలేసుకునేలా ఉంది. సామాన్యుడు ఏదైనా పన్ను కట్టడం ఆలస్యమైతే ముక్కుపిండి వసూలు చేసే యంత్రాంగం, తాము చెల్లించాల్సిన అద్దె విషయంలో మాత్రం ఇంతటి నిర్లక్ష్యం వహించడం విడ్డూరంగా ఉందని స్థానికులు విమర్శిస్తున్నారు.ప్రభుత్వ ఆఫీస్‌కే తాళం పడటంతో వివిధ పనుల నిమిత్తం వచ్చిన ప్రజలు, సిబ్బంది బయటే నిలబడాల్సిన దయనీయ పరిస్థితి ఏర్పడింది. అధికారుల అలసత్వం, ప్రభుత్వ నిధుల లేమికి ఈ ఘటన అద్దం పడుతోందని విపక్షాలు, ప్రజలు వ్యంగ్యాస్త్రాలు సంధిస్తున్నారు. విషయం తెలుసుకున్న ఉన్నతాధికారులు స్పందిస్తూ,జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే అద్దె బకాయిలు చెల్లించేలా చర్యలు తీసుకుంటామని సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. ఏదేమైనా, ఈ ఘటన జిల్లా అధికార యంత్రాంగం పనితీరుపై పెద్ద చర్చకు దారితీసింది.

ప్రతి అర్హత కుటుంబానికి ఐదు లక్షల జీవిత బీమా

జల సంరక్షణ పనులను వేగవంతం చేయాలి: జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



కౌడిపల్లి, నవంబర్ 23 (జనంసాక్షి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ద్వారా అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు. అలాగే ప్రతి గ్రామంలో జల సంరక్షణ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తూ జలసిరి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. సోమవారం కౌడిపల్లి మండల కేంద్రంలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం నమోదు ప్రక్రియతో పాటు జలసిరి పనులను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా బీమా పథకానికి సంబంధించి లబ్ధిదారుల నుంచి దరఖాస్తుల స్వీకరణ తీరును, నమోదు ప్రక్రియను అధికారులను అడిగి తెలుసుకున్నారు.



కలెక్టర్ ప్రతిమాసింగ్, మాట్లాడుతూ... ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు. దరఖాస్తు ఫారాలను ఎలాంటి తప్పులు లేకుండా పూర్తి చేయాలని, కుటుంబంలో 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తిని బీమా పొందే వ్యక్తిగా ప్రతిపాదించాలని తెలిపారు. సంబంధిత వ్యక్తి స్వయంగా దరఖాస్తుపై సంతకం చేసి, నామినీ వివరాలను స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు. దరఖాస్తుల వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో ఎలాంటి పొరపాట్లు లేకుండా నమోదు చేయాలని ఆదేశించారు.ఈ పథకం ద్వారా అర్హత కలిగిన కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా సౌకర్యం కల్పించనున్నట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని, నామినీ వివరాలు, సంతకాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులకు సూచించారు. నమోదు ప్రక్రియలో పారదర్శకత పాటిస్తూ అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకం అందేలా చూడాలన్నారు. అనంతరం జలసిరి పనులను పరిశీలించి ప్రజలు భాగస్వామ్యంతో గ్రామాల్లో నీటి సంరక్షణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా ప్రతి గ్రామంలో జల సంరక్షణ కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు. చేపట్టిన పనుల్లో నాణ్యత, పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్దేశిత సమయంలో పనులు పూర్తి చేసేలా సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చంద్రం కృష్ణ గౌడ్, తాసిల్దార్ కృష్ణ, ఎంపీడీవో శ్రీనివాస్, డి ఎల్ పి ఓ సురేష్ బాబు, పంచాయతీ సెక్రటరీ నాగేష్, తోపాటు సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తీవ్రమైన కేసుల దర్యాప్తులో నాణ్యత తప్పనిసరి

- పెండింగ్ కేసుల పరిష్కారంలో వేగం పెంచాలి
- నేరస్తులకు శిక్ష పడేలా పకడ్బందీ దర్యాప్తు
- బ్లాక్ స్పాట్ల గుర్తింపుతో ప్రమాదాలకు కళ్లెం
- డీఐజీ ఎల్.ఎస్. చౌహాన్





సంగారెడ్డి బ్యూరో నవంబర్ 23 (జనంసాక్షి): తీవ్రమైన కేసుల దర్యాప్తులో నాణ్యత తప్పనిసరిగా పాటించాలని డిఐజి ఎల్.ఎస్. చౌహాన్ పోలీసులకు సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా జోన్-6, చార్మినార్ జోన్ డీఐజీ ఎల్.ఎస్. చౌహాన్ ఐపీఎస్ సదాశివపేట రూరల్ సర్కిల్ పోలీసు కార్యాలయాన్ని సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొండాపూర్ పోలీసుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ తో కలిసి కార్యాలయ ఆవరణలో మొక్కను నాటారు. అనంతరం కార్యాలయంలోని వివిధ రికార్డులు, కేసుల దర్యాప్తు పురోగతి, సిబ్బంది విధుల నిర్వహణ, కార్యాలయ నిర్వహణ తీరును పరిశీలించారు. రికార్డుల నిర్వహణ, సిబ్బంది పనితీరు పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తూ అధికారులను అభినందించారు.

ఈ సందర్భంగా డీఐజీ మాట్లాడుతూ.. తీవ్రమైన నేరాలకు సంబంధించిన కేసుల్లో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి, నేరస్తులకు చట్టప్రకారం శిక్ష పడేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సూచించారు. సర్కిల్ పరిధిలోని పోలీస్ స్టేషన్లలో నమోదయ్యే కేసుల దర్యాప్తులో స్టేషన్ హౌస్ అధికారులకు అవసరమైన మార్గదర్శకత్వం అందించాలని, దర్యాప్తు మెళకువలు, చట్టపరమైన అంశాలపై అవగాహన కల్పించాలని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కు సూచించారు. ప్రతి కేసులో వృత్తి నైపుణ్యంతో, పారదర్శకంగా దర్యాప్తు చేపట్టి బాధితులకు సత్వర న్యాయం అందించాలని తెలిపారు. పోలీస్ స్టేషన్లలో రికార్డుల నిర్వహణతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.



అనంతరం కొండాపూర్, ఇస్నాపూర్ పోలీస్ స్టేషన్లను సందర్శించి పరిసరాల పరిశుభ్రత, రికార్డుల నిర్వహణను పరిశీలించారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులతో పాటు దర్యాప్తులో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఆర్థిక నేరాల నివారణకు పటిష్ట చర్యలు తీసుకోవాలని, ట్రాఫిక్ సమస్యల పరిష్కారంతో పాటు రోడ్డు ప్రమాదాల నివారణకు అధిక ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించాలని సూచించారు. ఆయా ప్రాంతాల్లో సూచిక బోర్డులు, వేగ నియంత్రణ పట్టీలు ఏర్పాటు చేయడంతో పాటు తగిన విద్యుత్ దీపాల సౌకర్యం కల్పించేందుకు సంబంధిత శాఖల సమన్వయంతో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, సంగారెడ్డి డీఎస్పీ సత్యయ్య గౌడ్, జిన్నారం డీఎస్పీ ప్రభాకర్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్లు సదానాగరాజు, సదాశివపేట రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సుమన్ కుమార్, కొండాపూర్ ఎస్ఐ సోమేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ

- లబ్ధిదారులకు ఇందిరమ్మ బీమా పత్రాల అందజేత



రేగోడ్, నవంబర్ 23 (జనంసాక్షి): మెదక్ జిల్లా రేగోడ్ మండలం మత్త వెంకటాపురం గ్రామంలో సోమవారం ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి సర్పంచ్ సంగమేశ్వర్ ఆధ్వర్యంలో భూమిపూజ నిర్వహించారు. లబ్ధిదారులు, కుటుంబ సభ్యులు, గ్రామస్తులతో కలిసి నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయడం అభినందనీయమన్నారు. లబ్ధిదారులు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసుకొని ప్రభుత్వ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం లబ్ధిదారులకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ బీమా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు, లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

121 కలశాలతో
వైభవంగా మహా రుద్రాభిషేకం



కౌడిపల్లి, నవంబర్ 23 (జనంసాక్షి): కార్తీక మాసం సందర్భంగా శ్రీశ్రీశ్రీ ఆదిలక్ష్మి ఆలయం ఆధ్వర్యంలో 121 కలశాలతో మహా రుద్రాభిషేకం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 121 మంది భక్తులు కలశాలతో స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. ఆలయ పూజారులు ప్రత్యేక పూజలు, విశేష ఆరాధనలు చేపట్టారు. వేదమంత్రాలు, శివనామస్మరణతో ఆలయ ప్రాంగణం మార్మోగింది. గత ఐదేళ్లుగా పదో వార్డు సభ్యుడు మంగళపర్తి సందీప్ తన సొంత ఖర్చులతో డీజే సౌండ్ ఏర్పాటు చేస్తున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రం కృష్ణ గౌడ్, సందీప్, వార్డు సభ్యులు బొంతమ్మ సంగప్ప, ప్రతాప్ రెడ్డి, జగన్, భక్తులు పాల్గొన్నారు.

సోయా పంటకు నిప్పు.. 120 క్వింటాళ్ల పంట దగ్ధం

గుర్తుతెలియని వ్యక్తుల దుశ్చర్యతో కౌలు రైతుకు భారీ నష్టం

కంగ్టి నవంబర్ 23



కష్టపడి సాగుచేసిన పంట చేతికొచ్చే సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో కౌలు రైతుకు తీరని నష్టం వాటిల్లింది. సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలం తుర్క వడగావ్ గ్రామంలో అర్ధరాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది.గ్రామానికి చెందిన కౌలు రైతు అశోక్ ఎనిమిది ఎకరాల్లో సోయాబీన్ పంట సాగు చేశాడు. పంటను కోసి నిల్వ ఉంచిన సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో పంట మొత్తం అగ్నికి ఆహుతైంది. సుమారు 120 క్వింటాళ్లకు పైగా సోయా పంట పూర్తిగా దగ్ధమైనట్లు సమాచారం.రెప్పపాటులో ఏడాది కష్టం బూడిద కావడంతో రైతు అశోక్ తీవ్ర ఆవేదనకు గురయ్యాడు. ఈ ఘటనతో భారీ ఆర్థిక నష్టం వాటిల్లింది. సమాచారం అందుకున్న ఏఎస్ఐ రవిగౌడ్ సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. పంటకు నిప్పు పెట్టిన దుండగులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని, తీవ్రంగా నష్టపోయిన కౌలు రైతు అశోక్‌కు ప్రభుత్వం తక్షణమే ఆర్థిక సహాయం అందించి ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

తనపై వచ్చిన ఆరోపణలను ఖండించిన
రాంపురం సర్పంచ్ కొమురయ్య



చేర్యాల, నవంబర్ 23 (జనంసాక్షి): సిద్దిపేట జిల్లా చేర్యాల మండలం రాంపురం గ్రామంలో అవినీతికి పాల్పడుతున్నారంటూ తనపై వచ్చిన ఆరోపణల్లో వాస్తవం లేదని గ్రామ సర్పంచ్ చెట్టె కొమురయ్య ఖండించారు. సోమవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళా సమైక్య భవన నిర్మాణంలో అవకతవకలు, గ్రామపంచాయతీ ట్రాక్టర్‌ను సొంత పనులకు వినియోగిస్తున్నారంటూ బొందిలి గణేష్ చేసిన ఆరోపణలు నిరాధారమని పేర్కొన్నారు. రాజకీయంగా తనను ఇబ్బంది పెట్టేందుకే తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. గ్రామ అభివృద్ధి పనులను నిబంధనల ప్రకారమే చేపడుతున్నానని, ఎవరైనా విచారణ జరిపించుకోవచ్చని స్పష్టం చేశారు. విలేకరి ముసుగులో డబ్బులు వసూలు చేస్తూ బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతున్నారని ఆరోపించారు. తనపై అసత్య ప్రచారాలు మానుకోవాలని హెచ్చరించారు.

అక్రమ రవాణా.. ఠాణాకు తరలింపు



పాపన్నపేట, నవంబర్ 23 (జనంసాక్షి): అనుమతులు లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. మెదక్ నుంచి బొడ్మట్‌పల్లి వైపు నుంచి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ఇసుక టిప్పర్‌ను నార్సింగి గ్రామ శివారులో ఆదివారం పట్టుకున్నారు. సోమవారం ఎన్కేపల్లి గ్రామ శివారులో మంజీరా నది నుంచి అనుమతులు లేకుండా అచ్చన్నపల్లి వైపు ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సైతం పట్టుకున్నారు. వాహనాలను ఠాణాకు తరలించి ఎస్ఐ కేసు నమోదు చేశారు.

చేర్యాల ప్రజావాణికి 4 దరఖాస్తులు

చేర్యాల, నవంబర్ 23 (జనంసాక్షి): చేర్యాల మండలంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 4 దరఖాస్తులు వచ్చినట్లు చేర్యాల ఎంపీడీఓ ప్రణయ్ తెలిపారు. ఇందులో 2 దరఖాస్తులు మండల పంచాయతీ అధికారికి, 1 తహసీల్దార్‌కు, 1 మండల విద్యాశాఖ అధికారికి వచ్చినట్లు తెలిపారు.

కొడపాకలో ఇసుక నిల్వలు సీజ్ ..



పాపన్నపేట, నవంబర్ 23 (జనంసాక్షి): అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని తహశీల్దార్ సతీష్ కుమార్, ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. సోమవారం కొడపాక గ్రామ శివారులో రెవెన్యూ, పోలీస్ బృందాలు తనిఖీలు చేపట్టాయి. వేర్వేరు ప్రాంతాల్లో అనుమతి లేని సుమారు 55 ట్రాక్టర్ల ఇసుకను గుర్తించి సీజ్ చేశారు.

రామునిబండ
జాతరకు పటిష్ట పోలీసు బందోబస్తు

- భక్తులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు



జగదేవ్‌పూర్, నవంబర్ 23 (జనంసాక్షి): జగదేవ్‌పూర్ మండలం జంగం రెడ్డిపల్లి సమీపంలోని రామునిబండ రామాలయంలో కార్తీక పౌర్ణమి జాతరకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు గజ్వేల్ ఏసీపీ నర్సింలు తెలిపారు. సోమవారం రూరల్ సీఐ రవిరాజుతో కలిసి ఆలయాన్ని పరిశీలించారు. మంగళవారం జాతరకు పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉండటంతో క్యూ లైన్లు, కోనేరులో స్నానాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. భక్తులు క్రమపద్ధతిలో స్వామివారిని దర్శించుకొని పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐ రవిరాజు, ఎస్ఐ కృష్ణారెడ్డి, సర్పంచ్ రజిత అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు
సీఎం సహాయనిధి అండ

- కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగుల గారి మల్లేశం గౌడ్



కొల్చారం, నవంబర్ 23(జనంసాక్షి): పేద, మధ్యతరగతి కుటుంబాలకు అనారోగ్య సమయంలో ఆర్థిక భరోసా కల్పిస్తూ ముఖ్యమంత్రి సహాయ నిధి అండగా నిలుస్తుందని కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాగుల గారి మల్లేశం గౌడ్ అన్నారు. సోమవారం నర్సాపూర్ పట్టణంలోని శ్రీ సాయి కృష్ణ గార్డెన్స్ లో నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ ఆవుల రాజిరెడ్డి చేతుల మీదుగా సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని అన్నారు. **ఈ సందర్భంగా మల్లేశం గౌడ్ మాట్లాడుతూ..** ఆవుల రాజిరెడ్డి సహకారంతో కొల్చారం మండలానికి సుమారు రూ.10.65 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు మంజూరయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు ముత్యం గారి గోవర్ధన్, మాజీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఏళ్లగారి శ్రీనివాస్ రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, అప్పాజీపల్లి గ్రామ అధ్యక్షుడు పహాజీ పాషా, కాంగ్రెస్ పార్టీ నాయకులు బండి మల్లేశం, అరిగే కిష్టయ్య పాల్గొన్నారు.

నర్సాపూర్ జడ్పీహెచ్ఎస్‌లో అల్పాహార పథకం ప్రారంభం



నర్సాపూర్, నవంబర్ 23 (జనంసాక్షి): స్థానిక జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన అల్పాహార పథకాన్ని సోమవారం ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు ప్రారంభించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీ రాజు యాదవ్, కౌన్సిలర్ సుధీర్ గౌడ్, ఎంఈఓ తారా సింగ్, ప్రధానోపాధ్యాయులు సామ్యనాయక్ విద్యార్థులకు అల్పాహారం వడ్డించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అల్పాహారం తీసుకోవడం వల్ల విద్యార్థుల ఆరోగ్యం మెరుగుపడటంతో పాటు చదువుపై ఏకాగ్రత పెరుగుతుందని తెలిపారు. పోషకాహారం అందించడం ద్వారా విద్యాభివృద్ధికి ఈ పథకం దోహదపడుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యసాయిబాబా 101వ జన్మోత్సవ వేడుకలు



గద్వాల, నవంబర్ 23 (జనంసాక్షి): గద్వాల సత్యసాయి పాఠశాలలో భగవాన్ శ్రీ సత్యసాయిబాబా 101వ జన్మోత్సవ వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డీకే సిద్ధారెడ్డి ప్రత్యేక పూజలు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సత్యసాయిబాబా ప్రేమ, సేవ, శాంతి బోధనలు ఆదర్శప్రాయమని, యువత ఆయన బాటలో నడిచి సమాజ సేవకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల భజనలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకోగా, భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

108 అమావాస్యలు.. నిరంతర అన్నదాన సేవ



సంగారెడ్డి బ్యూరో, నవంబర్ 23(జనంసాక్షి): సంగారెడ్డి పట్టణంలోని పోతిరెడ్డిపల్లిలో కొలువుదీరిన శ్రీ కేతకి సంగమేశ్వర స్వామి దేవాలయంలో 108 అమావాస్యల పాటు భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టాలని సాహితీ ఆసుపత్రి అధినేత రాము సంకల్పించారు. ఇందులో భాగంగా ప్రతి అమావాస్య రోజున భక్తులకు అన్నప్రసాదం అందిస్తున్నారు. సోమవారం అమావాస్య సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకం, అన్నపూజ నిర్వహించారు. ఆలయంలోని ఆంజనేయ స్వామికి చందనోత్సవం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు.

శ్రీ నవరత్నాల దేవస్థానంలో అన్న ప్రసాద వితరణ.....

సంగారెడ్డి లోని శ్రీ నవరత్నాలయ దేవస్థానంలో ఈనెల 24 నుంచి జనవరి 15వ తేదీ వరకు ప్రతిరోజు మధ్యాహ్నం ఒకటి నుంచి అయ్యప్ప స్వామి దీక్ష దారులకు అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సాహితీ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ రాము తెలిపారు. అయ్యప్ప స్వామి దీక్షలో ఉన్న స్వాములు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. అన్నసంతర్పణలో మనవి. భక్తులు వస్తూ ధన రూపేన అన్న ప్రసాదానికి తమ వంతు సహకారం అందించగలరని కోరుతున్నాం.

సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి సత్వర పరిష్కారం చూపాలి: జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

సంగారెడ్డి, నవంబర్ 23 (జనంసాక్షి): ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో అందిన ప్రతి అర్జీని అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, అర్హత మేరకు సత్వర పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు.

సోమవారం కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్, అదనపు కలెక్టర్లు సంగీత, పాండు ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. కార్యక్రమానికి వచ్చిన అర్జీదారుల సమస్యలను కలెక్టర్, అదనపు కలెక్టర్లు స్వయంగా ఆలకించి, సమస్యల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులకు వినతులను పంపిస్తూ తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..

ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును సంబంధిత శాఖల అధికారులు సమగ్రంగా పరిశీలించి, సమస్యల సత్వర పరిష్కారం పై దృష్టి సారించాలని సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 59 వినతులు అందినట్లు అధికారులు తెలిపారు. డివిజన్ల వారీగా సంగారెడ్డి డివిజన్‌లో 16, నారాయణఖేడ్ డివిజన్‌లో 8, జహీరాబాద్ డివిజన్‌లో 1 వినతి అందగా, కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణికి 34 వినతులు అందా యనీ ,అందోల్ డివిజన్‌లో ఎలాంటి వినతులు అంద లేదని అధికారులు వెల్లడించారు.



ప్రజావాణిలో రెవెన్యూ, పంచాయతీరాజ్, విద్య, పోలీస్, నీటిపారుదల, పౌరసరఫరాలు, విద్యుత్, మైనార్టీ సంక్షేమం, సాంఘిక సంక్షేమం, జిల్లా ఇంటర్మీడియట్ విద్య, లీడ్ బ్యాంక్, ఎస్సీ సంక్షేమం, డీఆర్‌డీఏ, గృహనిర్మాణం, రిజిస్ట్రేషన్లు, మహిళా, శిశు, వికలాంగుల సంక్షేమం, మున్సిపల్ తదితర శాఖలకు సంబంధించిన వినతులు అందాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ వేడుకకు హాజరైన ఆవుల రాజిరెడ్డి

సోమక్కపేటలో గొల్ల దశరథ కుటుంబానికి శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు

చిలప్‌చేడ్, నవంబర్, (జనంసాక్షి):

చిలప్ చేడ్ మండలంలోని సోమక్కపేట గ్రామానికి చెందిన గొల్ల దశరథకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ వేడుకకు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి హాజ రయ్యారు. ఈ సందర్భంగా నూతన గృహంలోకి అడుగుపెట్టిన దశరథ కుటుంబ సభ్యులకు శుభా కాంక్షలు తెలిపి, వారి కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో సోమక్కపేట సర్పంచ్ బెస్త దుర్గాచలం, మాజీ వైస్ ఎంపీపీ విశ్వంభర స్వామి,



మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నారాయణరెడ్డి, పండరి, సర్పంచులు ఆనంద్, రాజేందర్ రెడ్డి, రాములు, గ్రామ పార్టీ అధ్యక్షుడు మల్లేశం, నాయకులు కరణం శ్రీనివాస్, సుధాకర్, వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రారంభం...

- **అర్హులైన లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డుల అందజేత..**
- **ప్రభుత్వ సేవలు మరింత పారదర్శకంగా అందించడమే లక్ష్యం**

కోహిర్, నవంబర్ 23 (జనంసాక్షి): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం కోహిర్ మండలంలోని దిగ్వల్ గ్రామంలో ప్రారంభమైంది. గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద రేషన్ షాపు నంబర్ 371126 పరిధిలోని అర్హులైన లబ్ధిదారులకు రేషన్ డీలర్ జి.అశోక్ ఆధ్వర్యంలో కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం స్మార్ట్ కార్డుల ద్వారా రేషన్ వ్యవస్థలో పారదర్శకత పెంపొందించడంతో పాటు అర్హులైన కుటుంబాలకు సంక్షేమ పథకాలు సక్రమంగా అందించడమే లక్ష్యమని తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ రేషన్ పంపిణీ



వ్యవస్థను ఆధునికీకరించడంలో భాగంగా ఈ కార్డులను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. లబ్ధిదారులు తమకు కేటాయించిన కార్డులను సంబంధిత రేషన్‌షాపుల నుంచి స్వీకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ జి. అశోక్ తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు వైభవం

- **ఎస్బీఐ సీఎస్ఆర్ నిధుల కింద రూ.10 లక్షలు మంజూరు**

పెబ్బేరు, నవంబర్ 22 (జనంసాక్షి): పెబ్బేరు పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (ZPHS) అభివృద్ధికి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (SBI) సీఎస్ఆర్ నిధుల కింద రూ.10 లక్షలు మంజూరయ్యాయి. ఆదివారం వనపర్తి జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా



చైర్మన్ చల్లా శ్రీనివాస్ శెట్టి చేతుల మీదుగా పాఠశాలకు కేటాయించిన రూ.10 లక్షల చెక్కును పాఠశాల తరఫున అందుకున్నారు.

ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరసింహ గౌడ్ మాట్లాడుతూ.. పాఠశాలకు సీఎస్ఆర్ నిధులు మంజూరు కావడానికి ఉపాధ్యాయులు ఎంతో కృషి చేశారని తెలిపారు. పాఠశాల అభివృద్ధి కోసం ఎస్బీఐ ముందుకు వచ్చి రూ.10 లక్షల నిధులు కేటాయించడం ఎంతో సంతోషకరమైన విషయమని పేర్కొన్నారు. ఈ నిధులతో పాఠశాలకు అవసరమైన మౌలిక సదుపాయాలను గుర్తించి, గ్రామ పెద్దలు, స్థానిక ప్రముఖులతో చర్చించి, అందరి ఆమోదంతో అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు వెల్లడించారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు ఈ నిధులు ఎంతగానో ఉపయోగపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. పాఠశాల అభివృద్ధికి సహకరించిన ఎస్బీఐ యాజమాన్యానికి, నిధుల మంజూరుకు కృషి చేసిన ఉపాధ్యాయులకు ప్రధానోపాధ్యాయులు నరసింహ గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు.

17, 18వ వార్డుల్లో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభం



సదాశివపేట, నవంబర్ 23 (జనంసాక్షి):

మున్సిపాలిటీ పరిధిలోని 17,18వ వార్డుల్లో తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబం జీవిత బీమా పథకాన్ని ఆయా వార్డుల కౌన్సిలర్లు శజ్జి,బిట్ల నికిత ప్రేమ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అర్హులైన ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించడమే ఈ పథకం లక్ష్యమన్నారు. పథకం ద్వారా అర్హులైన కుటుంబాలకు రూ.5 లక్షల జీవిత బీమా రక్షణ లభిస్తుందని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, అర్హులందరికీ పథకం ప్రయోజనాలు అందేలా కృషిచేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు విష్ణువర్ధన్ రెడ్డి, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, రెండు వార్డుల ప్రజలు పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే ఎంతో ఉపయోగకరం



కోహెడ, నవంబర్ 23 (జనంసాక్షి): ఆత్మరక్షణకు కరాటే ఎంతో ఉపయోగపడుతుందని శ్రీ ఆదర్శ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ అంజయ్య, ప్రిన్సిపల్ శైలజ తెలిపారు. హుస్నాబాద్‌లో నిర్వహించిన 3వ ఇంటర్ స్టేట్ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్‌లో పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారన్నారు. విజేతలకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేశారు. కరాటే శారీరక దృఢత్వం, ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ పెంపొందిస్తుందని తెలిపారు. విద్యార్థులకు మరింత శిక్షణ అందించి ఉన్నత స్థాయికి తీసుకెళ్తామని పేర్కొన్నారు.

అన్నారంలో ఘనంగా సత్యసాయి బాబా శతజయంతి వేడుకలు



గుమ్మడిదల, నవంబర్ 23 (జనంసాక్షి): అన్నారం గ్రామంలో భగవాన్ శ్రీ సత్యసాయి బాబా శతజయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరై బాబా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రేమ, సేవ, శాంతి, మానవత్వం వంటి బాబా బోధనలు ప్రతి ఒక్కరికీ ఆదర్శమని పేర్కొన్నారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రజావాణిలో మెదక్, రామాయంపేట సమస్యలపై పద్మాదేవేందర్ రెడ్డి ఫిర్యాదు

డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి.. రామాయంపేట రెవెన్యూ డివిజన్ కార్యాలయాన్ని ప్రారంభించాలి

మెదక్ బ్యూరో, నవంబర్ 23 (జనంసాక్షి): మెదక్, రామాయంపేట పట్టణాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని మాజీ డిప్యూటీ స్పీకర్, బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు పద్మాదేవేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం మెదక్ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత అధికారులకు వినతిపత్రం అందజేశారు.



ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మెదక్ పట్టణంలో సుమారు 1,200కు పైగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాలు చేపట్టగా, సగానికి పైగా ఇళ్లను అర్హులైన పేదలకు పంపిణీ చేశామని తెలిపారు. మిగిలిన ఇళ్ల నిర్మాణాలు నేటికీ అసంపూర్తిగా ఉండటంపై ఆవేదన వ్యక్తం చేశారు. నిర్మాణాలు పూర్తి చేయకుండా లబ్ధిదారుల ఎంపికలో నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ కౌన్సిలర్లు ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డుల్లో గతంలో రూపొందించిన లబ్ధిదారుల జాబితాలను మార్చి కాంగ్రెస్ పార్టీకి చెందిన వారికి ఇళ్లు కేటాయించే ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ విషయంపై అదనపు కలెక్టర్ నగేష్‌కు ఫిర్యాదు చేసి, అర్హులైన పేదలకు న్యాయం చేయాలని కోరారు.



డిసెంబర్ 1లోగా కార్యాలయం ప్రారంభించాలి...

రామాయంపేటను రెవెన్యూ డివిజన్‌గా పునరుద్ధరించి, కార్యాలయాన్ని వెంటనే ప్రారంభించాలని పద్మాదేవేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ రామాయంపేటను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించడంతో పాటు అవసరమైన అధికారులను నియమించినప్పటికీ కార్యాలయం ప్రారంభించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యమని విమర్శించారు. ఎన్నికల సమయంలో కార్యాలయాలు సిద్ధిపేటకు తరలిపోతాయంటూ అసత్య ప్రచారాలు చేశారని ఆరోపించారు. డిసెంబర్ 1వ తేదీలోగా రెవెన్యూ డివిజన్ కార్యాలయాన్ని ప్రారంభించకపోతే ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ధర్నాలు నిర్వహించడంతో పాటు మరో ఉద్యమం చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఆరేళ్ల మల్లికార్జున్ గౌడ్, రామాయంపేట పీఏసీఎస్ చైర్మన్ బాధే చంద్రం, మాజీ చైర్మన్ పల్లె జితేందర్ గౌడ్, మాజీ వైస్ చైర్మన్ పుట్టి విజయలక్ష్మి, మామిళ్ల ఆంజనేయులు, జుబేర్ అహ్మద్, బట్టి ఉదయ్, దీపక్ కుమార్, గడ్డమిది కృష్ణ గౌడ్, మాయ మల్లేశం తదితర బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

విజయ డెయిరీ
నూతన చైర్మన్‌గా ఉత్కం కుమార్



చేర్యాల, నవంబర్ 23 (జనంసాక్షి): ముస్త్యాల గ్రామ విజయ డెయిరీ నూతన చైర్మన్‌గా ఉత్కం కుమార్‌ను డైరెక్టర్లు అందరూ సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఈ సందర్భంగా నూతన పాలకవర్గానికి పలువురు హార్దిక శుభాకాంక్షలు తెలియ జేశారు.

ఆరే వెంకటయ్య
మృతికి సీపీఐ నాయకుల నివాళి



చేర్యాల/ధూల్మిట్ట, నవంబర్ 23 (జనంసాక్షి): సిద్దిపేట జిల్లా ధూల్మిట్ట మండలంలోని సీపీఐ కూటిగల్ గ్రామశాఖ కార్యదర్శి ఆరే ఉపేందర్, మాజీ మావోయిస్టు పార్టీ రాష్ట్ర నాయకులు ఆరే సాయిలుల తండ్రి ఆరే వెంకటయ్య (88) మృతి పట్ల సీపీఐ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. సోమవారం గ్రామంలో వారి నివాసానికి వెళ్లి సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందే అశోక్, ధూల్మిట్ట మండల కార్యదర్శి వలబోజు నరసింహాచారి, డివిజన్ నాయకులు నంగి కనకయ్య, గూడెపు సుదర్శన్‌లు పార్థివ దేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

బీమాను సద్వినియోగం చేసుకోవాలి



పాపన్నపేట, నవంబర్ 23 (జనంసాక్షి): అర్హులైన ప్రతి ఒక్క కుటుంబం ఇందిరమ్మ బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని పాపన్నపేట గ్రామ సర్పంచ్ పావని గౌడ్ పేర్కొన్నారు. సోమవారం పాపన్నపేట గ్రామపంచాయతీ కార్యాలయంలో పేర్లు నమోదు ప్రక్రియలో ఆమె పాల్గొని బీమా పథకం గూర్చి గ్రామ ప్రజలకు వివరించారు. పంచాయతీ కార్యదర్శి నయీమ్, ఉపసర్పంచ్ సద్దాంహుస్సేన్, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు నరేందర్ గౌడ్ తదితరులు ఉన్నారు.

ఉపాధి హామీలో అవకతకలు

- **సామాజిక తనిఖీలో అలి రాజపేట ఫీల్డ్ అసిస్టెంట్ అవకతవకలపై గ్రామస్తులు నిలదీత**



జగదేవ్‌పూర్, నవంబర్ 23 (జనంసాక్షి): మండల కేంద్రమైన జగదేవ్‌పూర్‌లో స్థానిక రైతువేదిక వద్ద సోమవారం అధికారులు ఉపాధి హామీ సామాజిక తనిఖీ నిర్వహించారు. మండలంలో ఈ ఆర్థిక సంవత్సరం 6 కోట్ల రూపాయల విలువైన వివిధ రకాల పనులు జరగగా అందులో 1 లక్ష30 వేల రూపాయలు రికవరీకి ఆదేశాలిచ్చారు. అయితే అలి రాజపేట గ్రామానికి సంబంధించి ఫీల్డ్ అసిస్టెంట్ చాంద్ పాషా అవకతవకలకు పాల్పడ్డాడని గ్రామస్తులు సామాజిక తనిఖీలో నిలదీశారు.

ఈ క్రమంలో అధికారులు గ్రామానికి సంబం ధించి రికార్డులను పరిశీలించి అక్రమాలు జరిగినట్లు నిర్ధారిం చారు. ఈ విషయంలో చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అడిషనల్ డిఆర్డిఓ శ్రీనివాస్, ఎంపీడీవో వేణుగోపాల్ రెడ్డి, ఏటీఎం సుధాకర్ మండలంలోని వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప స్వామి ప్రాణప్రతిష్ఠ మహోత్సవాలు

శివపార్వతుల శాంతి కల్యాణానికి పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు

అమీన్‌పూర్, నవంబర్ 23 (జనంసాక్షి): బీరంగూడ గుట్టపై నూతనంగా నిర్మించిన శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో ప్రాణప్రతిష్ఠ మహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం శ్రీ పార్వతీ పరమేశ్వరుల శాంతి కల్యాణాన్ని వేద మంత్రోచ్ఛారణల మధ్య భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.



ఈ సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు కొలూరు మల్లేష్ మాట్లాడుతూ ఏడాది కాలంలోనే ఆలయ నిర్మాణం పూర్తి చేసి ప్రాణప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. దాతలు, కమిటీ సభ్యులు, అయ్యప్ప స్వాములు, భక్తుల సహకారంతో కార్యక్రమాలు విజయవంతమయ్యాయని తెలిపారు. సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.మంగళవారం చివరి రోజు ఏకశిలా 18 మెట్ల పడిపూజ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ప్రతాపరెడ్డి, ఎడ్ల రాజమల్లేష్, రవీందర్ రెడ్డి, నరేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం నమోదు ప్రారంభం

నారాయణపేట, నవంబర్ 23 (జనంసాక్షి): నారాయణపేట మండలం సింగారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం నమోదు కార్యక్రమాన్ని సోమవారం సర్పంచ్ నాగిరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో భూమి ఉన్న రైతులకే రైతు బీమా అందేదని, ప్రస్తుతం పేద కుటుంబాలకు భరోసా కల్పించేందుకు ప్రభుత్వం రూ.5 లక్షల జీవిత బీమా పథకాన్ని తీసుకొచ్చిందన్నారు. గ్రామంలో 500కు పైగా రేషన్ కార్డులు ఉన్నాయని, అర్హులైన ప్రతి ఒక్కరూ రేషన్ కార్డుతో వచ్చి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. కుటుంబ యజమాని వయస్సు 18 నుంచి 59 ఏళ్ల మధ్య ఉండాలని, డిసెంబర్ 22, 2026లోపు నమోదు పూర్తి చేసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, ఉపసర్పంచ్ లక్ష్మప్ప, గ్రామ పెద్దలు, అంగన్‌వాడీ టీచర్ పద్మ, మహిళలు పాల్గొన్నారు.



గ్రామ అభివృద్ధి
పనులకు అడ్డంకులు సృష్టిస్తున్నారు



ఖిల్లా ఘనపురం, నవంబర్ 23(జనంసాక్షి): రోడ్డుమిది తండాలో అభివృద్ధి పనులకు కొందరు అడ్డంకులు సృష్టిస్తున్నారని సర్పంచ్ దేవుజ నాయక్ ఆరోపించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో గ్రామస్థులతో కలిసి ఫిర్యాదు చేశారు. గ్రామ పంచాయతీ వీఓ భవన నిర్మాణ పనులను కొందరు అడ్డుకుంటున్నారని తెలిపారు. ఈ నెల 8న గ్రామసభలో కార్యదర్శి సమక్షంలో నిర్మాణానికి తీర్మానం చేసి నప్పటికీ పనులు ప్రారంభించకుండా అడ్డంకులు కల్పిస్తున్నారని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు స్పందించి నిర్మాణ పనులు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని, గ్రామ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా భరోసా

- **ఇందిరమ్మ జీవిత బీమా పథకంపై అవగాహన**

కంగ్టి, నవంబర్ 23 (జనంసాక్షి): తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి పేద, మధ్యతరగతి కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం సద్వినియోగం చేసుకోవాలని నారాయణఖేడ్ నియోజకవర్గం కంగ్టి మండల పరిధిలోని రాజారాంతాండ గ్రామ పంచాయతీ కార్యదర్శి పవార్ రాజు అన్నారు.కుటుంబంలో సంపాదించే వ్యక్తికి ఏదైనా అనుకోని ప్రమాదం జరిగినా, ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా అండగా నిలవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ పథకాన్ని రూపొందించారు. అని అన్నారు. ఈ పథకం ద్వారా అర్హత కలిగిన కుటుంబాలకు రూ.5 లక్షల జీవిత బీమా రక్షణ కల్పించనున్నారు. బీమా ప్రీమియం భారాన్ని ప్రభుత్వమే భరించడం ఈ పథకంలోని ప్రధాన ప్రత్యేకత. దీంతో అర్హులైన కుటుంబాలు తమపై అదనపు ఆర్థిక భారం లేకుండానే జీవిత బీమా ప్రయోజనం పొందే అవకాశం ఉంటుంది. నమోదు విధానం ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ప్రతి కుటుంబానికి ఒకరికి మాత్రమే బీమా వర్తిస్తుంది. 18 సంవత్సరం నుండి 59 సంవత్సరాల వరకు వయో పరిమితి ఉందని అని అన్నారు.



నేడు తూప్రాన్‌లో నూతన జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రారంభోత్సవం



తూప్రాన్, నవంబర్ 23 (జనంసాక్షి): మెదక్ జిల్లా తూప్రాన్‌లో నూతనంగా ఏర్పాటైన జూనియర్ సివిల్ జడ్జి – కమ్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ ఫస్ట్ క్లాస్ కోర్టు ప్రారంభోత్సవం మంగళవారం ఉదయం 10గంటలకు జరగనుంది.



ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి, మెదక్ జిల్లా అడ్మిని స్ట్రేటివ్ జడ్జి జస్టిస్ సుద్దాల చలపతి రావు లచే ప్రారంభించనున్నట్లు జిల్లా డిస్టిక్ అండ్ సెషన్స్ జడ్జి శ్రీమతి నీలిమ తెలిపారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ హైకోర్టు న్యాయ మూర్తులు జస్టిస్ బి.విజయ్‌సేన్ రెడ్డి, జస్టిస్ అనిల్ కుమార్ జూకంటి, జస్టిస్ నర్సింగ్‌రావు నందికొండ పాల్గొన నున్నారు.

ఈ ఆహ్వాన కార్యక్రమాన్ని మెదక్ జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి శ్రీమతి జి.నీలిమ, మెదక్ జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీ కె.జనార్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

వార్డు సభ్యులకు ప్రాధాన్యత కల్పించాలి



- **తెలంగాణ వార్డు సభ్యుల ఫోరం నాయకులు**

ఖిల్లా ఘనపురం, నవంబర్ 23 (జనంసాక్షి): ఖిల్లా ఘనపురం మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన వార్డు సభ్యులు సోమవారం వనపర్తి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా వార్డు సభ్యుల ఇన్‌చార్జి నక్క సుధాకర్ కలెక్టర్ ఆదర్శ్ సురభి కి వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా తెలంగాణ వార్డు సభ్యుల ఫోరం నాయకులు మాట్లాడుతూ.. గ్రామస్థాయిలో ప్రజల సమస్యలను పరిష్కరించడంలో కీలక పాత్ర పోషిస్తున్న వార్డు సభ్యులకు ప్రభుత్వ అధికారిక కార్యక్రమాల్లో తగిన ప్రాధాన్యత కల్పించాలని కోరారు.స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలచే ఎన్నుకోబడిన వార్డు సభ్యులకు గౌరవ వేతనం అందించాలని, గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనుల భూమిపూజ కార్యక్రమాలు, శిలాఫలకాలపై సంబంధిత వార్డు సభ్యుల పేర్లను నమోదు చేయాలని విజ్ఞప్తి చేశారు.అలాగే విధుల్లో ఉన్న సమయంలో లేదా సాధారణ పరిస్థితుల్లో వార్డు సభ్యులు మరణించినట్లయితే వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించేలా రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని కోరారు. వార్డు సభ్యులకు ప్రత్యేక ఆరోగ్య బీమా, హెల్త్ కార్డులు మంజూరు చేయడంతో పాటు గ్రామ అభివృద్ధి పనుల కాంట్రాక్టుల్లో వార్డు సభ్యులను భాగస్వాములను చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యుల మండల అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్‌తో పాటు లింగ స్వామి పటేల్, ఖాదరయ్య, జానకిరాములు, కేశవరెడ్డి కుమార్, రాములు, భాస్కర్, ఎదుట్ల మహేష్, రవి రాము ల నాయక్, ఎల్లస్వామి, యేసు, రామస్వామి, మల్లేష్, అంజిచారి, చెన్నకేశవులు, సురేష్, అజయ్ తదితర వార్డు సభ్యులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యంతో ప్రజల ప్రాణాలకు ముప్పు!

వాడ్యాల శివారులో ప్రధాన రహదారి పక్కన గుంత. ప్రమాదం పొంచి ఉందంటున్న వాహనదారులు



మిడ్జిల్, నవంబర్ 23 (జనంసాక్షి): మండలంలోని వాడ్యాల గ్రామ శివారులో వాడ్యాల నుంచి మసిగుండ్లపల్లికి వెళ్లే ప్రధాన రహదారి పక్కన గుంతలు తవ్వి అలాగే వదిలేయడంతో వాహనదారులు, ప్రయాణి కులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారి పక్కనే ప్రమాదకరంగా గుంతలు ఉండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగు తుందోనని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో గుంతలు కనిపించక వాహన దారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని వారు చెబుతున్నారు. గుంతలు తవ్విన అనంతరం వాటిని పూడ్చకుండా, కనీసం హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయకుండా వదిలేయడంపై అధికారుల తీరుపై వాహన దారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పు పొంచి ఉన్నా సంబంధిత అధికారులకు ఈ సమస్య పట్టడం లేదా? ప్రజల ప్రాణా లంటే లెక్క లేదా? అంటూ వాహనదారులు ప్రశ్నిస్తున్నా రు. ప్రమాదాలు జరిగిన తర్వాత స్పందించడం కాకుండా ముందుగానే అధికారులు స్పందించి గుంతలను వెంటనే పూడ్చివేయాలని, రహదారిపై ప్రయాణించే ప్రజలకు భద్రత కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు: కలెక్టర్ సిహెచ్ ప్రియాంక





కృష్ణ, నవంబర్ 23 (జనంసాక్షి): విధుల పట్ల నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నారాయణపేట జిల్లా కలెక్టర్ ప్రియాంక అన్నారు. ప్రజల ఫిర్యాదులు పెండిం గ్లో ఉంచకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక తాసిల్దారు శ్రీనివాస్ ను ఆదేశించారు. సోమవారం కృష్ణ మండల తాసిల్దార్ కార్యా లయాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించి పలు రికార్డులు, పరిశీలించారు. అలాగే సబ్ రిజిస్టర్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డ్ గదిని తనిఖీ చేసిన కలెక్టర్ కంప్యూటర్ గదిని తనకి చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వెరిఫికేషన్ ఎవరు చేస్తారని సెక్షన్ వారిని అడిగి తెలుసుకున్నారు.తహసీల్దార్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రీవెన్స్ డేలో వచ్చిన ఫిర్యాదులు పెండిం గ్లో ఉంచకుండా ఎప్పటిక ప్పుడు పరిష్కరించాలని తాసి ల్దార్‌ను ఆదేశించారు.

ప్రజావాణికి మూడు ఫిర్యాదులు!

తిరుమలగిరి గ్రామం నుంచి రెండు.. మరో గ్రామం నుంచి ఒక ఫిర్యాదు స్వీకరణ!



బాలానగర్, నవంబర్ 23 (జనంసాక్షి): బాలానగర్ ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టే లక్ష్యంతో బాలానగర్ మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వ హించారు. ప్రజావాణి నోడల్ అధికారి, ఎంపీడీవో అనిల్ కుమార్ రెడ్డి ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు.

ఈ సందర్భంగా తిరుమలగిరి గ్రామానికి సంబంధించిన రెండు ఫిర్యాదులు, మరో గ్రామానికి సంబంధించిన ఒక ఫిర్యాదు కలిపి మొత్తం మూడు ఫిర్యాదులు అధికారులకు అందాయి. ఆయా ఫిర్యాదులను పరిశీ లించిన అధికారులు సంబంధిత శాఖ లకు పంపించి సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని సూచించా రు. ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకువచ్చేందుకు ప్రజావాణి కార్యక్రమం ఉపయోగపడు తుందని, అందిన ఫిర్యాదులను సంబం ధిత శాఖల అధికారులు పరిశీలించి పరి ష్కారానికి కృషి చేయాలని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు గురుపీఠానికి శ్రీ శ్రీ వేదానంద సరస్వతి స్వామి రాక



శివ్వంపేట, నవంబర్ 23 (జనంసాక్షి): హిమాలయ సంత్ శ్రీ వేదానంద సరస్వతీ స్వామీ కార్తీక మాసం ఈ నెల 25 న బుధవారం ఉదయం 10 గంటలకు శివ్వంపేట మండలం గూడూరు గ్రామ శివారులో కొలువైన శ్రీ గురుపీఠానికి వస్తున్నారని శ్రీ గురు పీఠం ఫౌండర్ ట్రస్ట్ చైర్మన్, ప్రముఖ హైకోర్టు న్యాయవాది జిన్నారం పెద్ద గౌని శివకుమార్ గౌడ్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిమాలయ గురువు అయినా శ్రీ వేదానంద సరస్వతీ స్వామివారి ఆగమనమే శు భముహూర్తంగా తామంతా భావిస్తున్నమని కాబట్టి భక్తులందరూ స్వామివారి దర్శనం కోసం ఉదయం తొమ్మిది గంటల వరకు ఈ గురు పీఠం దేవాలయానికి విచ్చేసి శ్రీ దత్తాత్రేయ స్వామి పంచాయతనం గురుపరంపర దేవతామూర్తుల పంచవటి దేవతామూర్తుల శ్రీ శిరిడి సాయిబాబా గురుదేవుల పూజ ఆరాధనలో పాల్గొని, శ్రీ వేదానంద సరస్వతి స్వామి వారి నీ దర్శించుకుని స్వామివారి దివ్య సందేశాన్ని ఆలకించాలని విజ్ఞప్తి చేశారు. ఆ తర్వాత స్వామి వారి ఆశీస్సులు అందుకని ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలన్నారు. అలాగే మధ్యాహ్నం 12 గంటలకు శ్రీ సాయిబాబా మధ్యాహ్న హారతి అనంతరం వేదనంద స్వామివారి చేతుల మీదుగా అన్న ప్రసాద వితరణ ఉంటుందని. ఈ సదవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకొవాలని శ్రీ గురు పీఠం చారిటబుల్ ట్రస్ట్ తరపున ట్రస్ట్ చైర్మన్ శివ కుమార్ గౌడ్ రమాదేవి దంపతులు విజ్ఞప్తి చేశారు.

72 జంటలతో లక్ష వత్తుల దీపారాధ



పెద్ద శంకరంపేట్, నవంబర్ 23 (జనంసాక్షి): కార్తీక చతుర్దశి సందర్భంగా సోమవారం పెద్ద శంకరంపేటలోని రేణుక ఎల్లమ్మ దేవాలయంలో ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సంఘం మహిళా అధ్యక్షురాలు రాగం అర్చన నేతృత్వంలో ఈ కార్యక్రమం వైభవంగా జరిగింది. 72 జంటలు పాల్గొని ఒక్కో జంట లక్ష వత్తుల చొప్పున దీపారాధన చేశారు. ఆలయ ప్రాంగణం దీపాల వెలుగులతో ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. తులసీ దామోదర కల్యాణం, శివాభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. కార్తీకమాస పవిత్రతను చాటుతూ మహిళలు భక్తి పారవశ్యంతో పూజల్లో పాల్గొన్నారు.

కార్మికుల డిమాండ్ల సాధనకు సమ్మెకు సీపీఎం మద్దతు

- **డిసెంబర్ 1,2,3 తేదీల్లో ఢిల్లీ కార్యక్రమానికి తరలిరావాలి: చుక్కరాములు**

మెదక్ బ్యూరో, నవంబర్ 23 (జనంసాక్షి): కార్మిక హక్కుల సాధన కోసం డిసెంబర్ 1, 2, 3 తేదీల్లో నిర్వహించే 'ఆక్యుపై ఢిల్లీ' కార్యక్రమానికి సీపీఎం సంపూర్ణ మద్దతు ఇస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు తెలిపారు. సోమవారం మెదక్‌లోని కేవల్ కిషన్ భవన్‌లో జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.

కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు ప్రయోజనం చేకూర్చే విధానాలను అమలు చేస్తోందని, కార్మిక చట్టాల రద్దుతో కార్మికులకు రక్షణ లేకుండా పోయిందని విమర్శించారు. రైతుల నల్ల చట్టాల వ్యతిరేక పోరాటం తరహాలో కార్మికులు కూడా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ప్రజా ఉద్యమాలను అణచివేసేందుకు మతాన్ని సాధనంగా ఉపయోగించి ప్రజల మధ్య విభజన సృష్టించే ప్రయత్నాలను తిప్పికొట్టాలన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో జరిగే



కార్యక్రమానికి మెదక్ జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం. అడివయ్య, జిల్లా కార్యదర్శి కే. నర్సమ్మ, నాయకులు ఏ. మల్లేశం, కే. మల్లేశం, బి. బాలమణి, మహేందర్ రెడ్డి, బస్వరాజు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులపై నిర్లక్ష్యం వద్దు.. నిష్పక్షపాత విచారణ జరపాలి

- మధ్యవర్తుల అవసరం లేదు..
- ప్రజలు నేరుగా ఫిర్యాదు చేయవచ్చు
- బాధితులకు సత్వర న్యాయం అందించాలి
- జిల్లా ఎస్పీ పారితోష్ పంకజ్

సంగారెడ్డి బ్యూరో, నవంబరు 23 (జనంసాక్షి): ప్రజావాణిలో అందిన ఫిర్యాదులపై నిర్లక్ష్యం చేయకుండా నిష్పక్షపాత విచారణ జరపాలనీ ఎస్పీ పారితోష్ పంకజ్ పేర్కొన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించిన ఆయన, ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి వారి



సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఫిర్యాదుల వివరాలను తెలుసుకున్నారు. ప్రతి ఫిర్యాదుపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి, బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. స్థానిక పోలీస్ స్టేషన్లలో తమ సమస్యలకు పరిష్కారం లభించని వారు ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదన్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణికి హాజరై తమ ఫిర్యాదులను అందజేయాలని ప్రజలకు సూచించారు. బాధితులకు సత్వర అన్యాయం జరిగేలా పోలీసుల సహకారం ఉంటుందని తెలిపారు.

సర్పంచ్ పై ప్రజావాణిలో ఫిర్యాదు



చేర్యాల, నవంబర్ 23 (జనంసాక్షి): మండలంలోని రాంపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన మహిళా భవనం పనులతో పాటు గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ గ్రామానికి చెందిన గణేష్ సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. సర్పంచ్ కొమురయ్య వ్యవహార శైలిపై సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో ప్రణయ్‌కు వినతిపత్రం ఇచ్చినట్లు ఓ ప్రకటనలో తెలిపారు.10 లక్షల వ్యయంతో నిర్మించిన మహిళా భవనం పనులను సర్పంచ్ స్వయంగా కాంట్రాక్టు తీసుకుని, నిర్మాణ సామగ్రి రవాణా కోసం గ్రామపంచాయతీకి చెందిన ట్రాక్టర్‌ను వినియోగించుకున్నారని ఆరోపించారు.
అంతేకాకుండా ట్రాక్టర్ డ్రైవర్‌తో పాటు గ్రామపంచాయతీ సిబ్బందిని సైతం వ్యక్తిగత నిర్మాణ పనులకు ఉపయోగించుకున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

పెద్దాపూర్ శివారులో మహిళ ఆత్మహత్య

డబ్బుల వివాదంతో మనస్తాపం చెంది బలవన్మరణం

కొండాపూర్, నవంబర్ 23 (జనంసాక్షి): పెద్దాపూర్ శివారులోని ఓ నర్సరీలో పనిచేస్తున్న కొండాపూర్ గ్రామానికి చెందిన నాయి కోటి నస్రిన్ (40) ఆత్మహత్యకు పాల్పడింది. భర్త ఐదేళ్ల క్రితం మృతి చెందడంతో నర్సరీలో పనిచేస్తూ జీవనం సాగిస్తోంది. నర్సరీలో పరిచయమైన వ్యక్తితో డబ్బుల విషయంలో వివాదం తలెత్తడంతో మనస్తాపానికి గురై ఆదివారం అర్ధరాత్రి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై సోమేశ్వరి తెలిపారు. మృతురాలి తల్లి ఖాజామీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.



కున్సీలో నూతన ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవం

కృష్ణ, నవంబర్ 23 (జనంసాక్షి): మండలంలోని కున్సి గ్రామానికి చెందిన తప్పటి జ్యోతి (భర్త సంజీయ్), కావలి బాణమ్మ నూతన ఇందిరమ్మ ఇళ్లను సోమవారం మండల, గ్రామ కాంగ్రెస్ నాయకులు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పేద, నిరుపేద కుటుంబాల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందన్నారు. లబ్ధిదారులకు నూతన గృహాలు అందుబాటులోకి రావడం సంతోషకరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మ్యాకల్ సురేష్, పంచాయతీ కార్యదర్శి, కాంగ్రెస్ మండల నాయకులు మాలి పటేల్ విజయప్ప గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు, గ్రామ అధ్యక్షుడు పల్లె సురేష్ తదితరులు పాల్గొన్నారు.



ఏఐసీసీ తెలంగాణ నూతన ఇన్‌చార్జ్ సందీప్‌కు శుభాకాంక్షలు



పటాన్‌చెరు, నవంబర్ 23 (జనంసాక్షి): ఏఐసీసీ తెలంగాణ నూతన ఇన్‌చార్జ్‌గా నియమితులైన బి.ఎం. సందీప్‌ను టీపీసీసీ ఉపాధ్యక్షులు గాలి అనిల్ కుమార్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.
ఈ సందర్భంగా గాలి అనిల్‌కుమార్ మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడంలో సందీప్ నాయకత్వం కీలకమని అన్నారు. పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ క్షేత్రస్థాయిలో పార్టీని పటిష్టం చేయాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు పార్టీ సంస్థాగత బలోపేతానికి కలిసికట్టుగా పనిచేస్తామని తెలిపారు.
నూతన బాధ్యతల్లో సందీప్ విజయవంతంగా రాణించి పార్టీకి మరింత బలం చేకూర్చాలని గాలి అనిల్ కుమార్ ఆకాంక్షించారు.

నది తీర ప్రాంత రైతులకు త్వరలో చెక్‌డ్యామ్‌ల నిర్మాణంతో మేలు

కృష్ణ, నవంబర్ 23 (జనంసాక్షి): కృష్ణ నది తీర ప్రాంతంలో చెక్ డ్యాంలు నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.మంత్రి డా. వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు కృష్ణానది ప్రవహించే కోల్పూర్, ముడుమ ల్ గ్రామాల సమీపంలో నూతనంగా చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి అనువైన ప్రదేశాలను సోమవారం సంబంధిత డీఈ, కాంగ్రెస్ కృష్ణ మండలం అధ్యక్షులు విజ్జప్ప గౌడ్. ముడుమాల్ సర్పంచ్ బాలప్ప. టైరోడ్, నాగేశ్వరరావు. నర్సింహా తమప్ప. వెంకటేష్. అధికారులు సందర్శించి పరిశీలించారుకృష్ణానది తీర ప్రాంత రైతులకు సాగునీటి సౌకర్యం మెరుగు పరచడంతో పాటు, నీటి నిల్వ ద్వారా వ్యవసాయా నికి మరింత ప్రయోజనం కల్పించాలనే లక్ష్యంతో మంత్రి వాకిటి శ్రీహరి చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి నిర్ణయం తీసుకున్నారు.ఈ చెక్‌డ్యామ్‌ల నిర్మాణం పూర్తయితే పరిసర ప్రాంత రైతులకు సాగునీటి విష యంలో ఎంతో మేలు చేకూరనుందన్నారు. త్వర లోనే నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని అధికారులు తెలిపారు.



హేతువాద వేదాంత కవి సిద్ధప్ప వరకవి రాజయోగి స్వగ్రామంలో నేడు గురుపూజోత్సవం

కోహెడ, నవంబర్ 23 (జనంసాక్షి): మండలంలోని గుండారెడ్డి పల్లి గ్రామానికి చెందిన గోల్కొండ, తెలంగాణ తొలి సమాజ తత్వకవి అయినటువంటి సిద్ధప్ప వరకవి రాజయోగి గురుపూజోత్సవం కార్తీక పౌర్ణమి మంగళవారం రోజు గుండారెడ్డిపల్లి గ్రామంలోని సిద్ధప్ప ఆశ్రమంలో నిర్వహిస్తున్నట్లు సిద్ధప్ప కళాపీఠం ప్రతినిధి అనంతవరం మాణిక్యలింగం సోమవారం ఒక ప్రకటన లో తెలిపారు. గురుపూజోత్సవాన్ని పురస్కరించుకొని ఉదయం సిద్ధప్ప చిత్రపటంతో భక్తుల ఆధ్వర్యంలో గ్రామంలో వాడ వాడలా ఊరేగింపు కార్యక్రమం నిర్వహించి, ఆశ్రమం చేరుకోవడం జరుగుతుందని అన్నారు.



అనంతరం అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వారు తెలియజేశారు. ఇట్టి కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమమును విజయవంతం చేయాల్సిందిగా మాణిక్యలింగం కోరారు.

'పాఠ్యాంశంగా సిద్ధప్ప సాహిత్యం:
తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంలో సిద్ధప్ప కవి కళాతోరణం ఏర్పాటు చేయడంతోపాటు, "తెలంగాణ తేజోమూర్తి"గా గుర్తించబడ్డారు. తొమ్మిదవ తరగతి అలాగే ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం తెలుగు పాఠ్యపుస్తకాల్లో పాఠ్యాంశాలుగా సిద్ధప్ప జీవితం సాహిత్యం కొనసాగించడం సిద్ధప్పకు దక్కిన అపూర్వ గౌరవం చెప్పవచ్చును. శనిగరం జలాశయాన్ని ఆనుకొని, కొండలు, గుట్టలు, పచ్చదనం ఉట్టిపడే ఎత్తైన ప్రాంతంలో గల సిద్ధప్ప ఆశ్రమాన్ని అభివృద్ధి చేస్తే పర్యాటక ప్రదేశంగా రూపుదిద్దుకుంటుందని గ్రామస్థులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

సిద్ధప్ప వరకవి రచనలు:
దాదాపు నలభై గ్రంథాల వరకు రచించిన సిద్ధప్ప ఆయన రచనల్లో "సిద్ధప్ప వరకవి జ్ఞానబోధిని" నాలుగు సంపుటాలు బహుళ ప్రజాదరణ పొందాయి. 'కాకిహంసో పాఖ్యానము,జీవనరేంద్ర డ్రామా,అశోక సామ్రాజ్యం యక్ష గానం,శివస్తుతి,విష్ణు భజనావళి, నీతి శాస్త్రం,వర్ణమాల కందార్థాలు,గోవ్యాగ్ర సంభాషణ,బిక్కనవోల్ కందార్థాలు,యాదగిరి భజనావళి' వంటి గ్రంథాలను రచించి,దాదాపు అన్ని పద్య ప్రక్రియలతో పాటు యక్షగానం, స్తోత్రాలు ,వర్ణమాల, దండకాలు, సుభాషితాలు హితబోధ,వేదాంత తత్వ కీర్తనలు,కాలజ్ఞానం, నక్షత్రమాల, నాటకాలు వంటి ఎన్నో రచనలు చేశారు సిద్దప్ప.

కేతకీ సంగమేశ్వర ఆలయాన్ని దర్శించుకున్న అదనపు కలెక్టర్ సంగీత



ఝరాసంగం, నవంబర్ 23 (జనంసాక్షి): దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన ఝరాసంగం శ్రీ కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయాన్ని సోమవారం సంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సంగీత మండల రెవెన్యూ అధికారులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఆమెకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం శివలింగానికి అభిషేకం నిర్వహించి, పార్వతీ సమేత సంగమేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ ఈవో శివరుద్రప్ప, వైర్‌మన్ చంద్రశేఖర్ అదనపు కలెక్టర్‌ను శాలువా, పూలమాలతో సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ భాస్కర్, నాయబ్ తహసీల్దార్ రాజు గౌడ్, హన్మంత్ రావు పాటిల్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

జనగణన కోసం విద్యాబోధన కుదించవద్దు



జుక్కల్, నవంబర్ 23 (జనంసాక్షి): జనవరిలో జరిగే జనగణన కోసం ఉపాధ్యాయులతో డిసెంబర్‌లోపే సిలబస్ పూర్తి చేయించాలని జనాభా లెక్కల విభాగం సూచించడం సరికాదని బీసీ జాగృతి సేన రాష్ట్ర అధ్యక్షులు బూర్గుపల్లి కృష్ణ యాదవ్ అన్నారు. సోమవారం జుక్కల్ ఎంఆర్‌సీ ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హడావుడిగా సిలబస్ ముగిస్తే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందదని, మార్చి వరకు ఉపాధ్యాయులతో విద్యాబోధన కొనసాగించాలని కోరారు. జనగణన విధులకు గ్రామ కార్యదర్శులు, ఇతర ప్రభుత్వ ఉద్యోగులను వినియోగించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు నర్సిములు, విజయ్ కుమార్, శేఖర్, గోపాల్, చెన్నయ్య, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధి బీఆర్ఎస్ హయాంలోనే: శ్రీశైలం యాదవ్





రాజాపూర్, నవంబర్ 23 (జనంసాక్షి): నియోజకవర్గంలో బీఆర్ఎస్ హయాంలో ఒక్క పాఠశాల భవనం కూడా మంజూరు కాలేదంటూ ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై రాజాపూర్ మండల బీఆర్ఎస్ నాయకులు స్పందించారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన పాఠశాల భవనాలను పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు శ్రీశైలం యాదవ్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత అనిరుధ్ రెడ్డి ఎక్కడెక్కడ పాఠశాల భవనాలు నిర్మించారో వెల్లడించాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో నిర్మించిన భవనాలను తాము చూపిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు బచ్చిరెడ్డి, నర్సింహులు, రమేష్ నాయక్, సత్తయ్య, యాదగిరి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

లక్ష్మాపూర్-ఆరేపల్లి తండా రహదారిని డబుల్ రోడ్డుగా మార్చాలి

- ప్రజావాణిలో అదనపు కలెక్టర్‌కు సర్పంచ్ వినతి



రామాయంపేట, నవంబర్ 23 (జనంసాక్షి): రామాయంపేట మండలం 765DG రోడ్డు నుంచి లక్ష్మాపూర్ మీదుగా కామారెడ్డి జిల్లా ఆరేపల్లి తండా వరకు డబుల్ రోడ్డు నిర్మించాలని దంతేపల్లి సర్పంచ్ మస్కూరి బాల్‌రాజు ప్రజావాణిలో జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం ఉన్న ఇరుకైన సింగిల్ బీటీ రోడ్డుతో 22 గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రైతులు, విద్యార్థులు, ప్రయాణికులతో పాటు అత్యవసర వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. రెండు జిల్లాలను అనుసంధానించే ఈ రహదారికి నిధులు మంజూరు చేసి డబుల్ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని కోరారు.

రహదారి ప్రమాదాల నివారణకు భద్రతా చర్యలు చేపట్టాలి



గద్వాల, నవంబర్ 23 (జనంసాక్షి): జిల్లాలో పెరుగుతున్న రహదారి ప్రమాదాల నివారణకు తక్షణ చర్యలు చేపట్టాలని పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు దానయ్య డిమాండ్ చేశారు. సోమ వారం ఆర్‌అండ్‌బీ సూపర్‌వైజర్ భాస్కర్‌కు వినతిపత్రం అంద జేశారు. మంగంపేట, మల్దకల్, శేషంపల్లి, వెంకటా పురం, శాంతినగర్, పార్వర్ల స్టేజి తదితర ప్రమాదకర ప్రాంతా ల్లో స్పీడ్ బ్రేకర్లు, రేడియం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయా లని కోరారు. ఎర్రవల్లి నుంచి జాతీయ రహదారి వరకు రోడ్డు విస్తరణ, మరమ్మతు పనులు వేగవంతం చేయాలని విజ్ఞప్తి చేశా రు. నిర్లక్ష్యం కొనసాగితే ఆందోళనలు చేపడతామని హెచ్చ రించారు.

మద్దూరులో హిత చింతక్ అభియాన్ ప్రారంభం



మద్దూరు, నవంబర్ 23(జనంసాక్షి): మద్దూరు మండల కేంద్రం లో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం హిత చింతక్ అభియాన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా పరిషత్ ప్రతి నిధులు మాట్లాడుతూ హిందూ సమాజంలో ఐక్యత, చైతన్యం పెంపొందించడమే అభియాన్ లక్ష్యమని తెలిపారు. కార్యక్రమం లో శివకుమార్, మురళి, నారాయణపేట జిల్లా సహ కార్యదర్శి సాయప్ప, జిల్లా ఉపా ధ్యక్షులు, గౌరవ అధ్యక్షుడు కాలప్ప, సిపిరి వెంకటయ్య, కాశీ నాథ్, రాఘవేందర్, వెంకటేష్, నర్సింహులు, భాస్కర్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణానికి సిమెంటు అందజేత



కల్వకుర్తి, నవంబర్ 23 (జనంసాక్షి): కల్వకుర్తి 14వ వార్డు గాంధీనగర్‌కు చెందిన మహ్మద్ జంగీర్ ఆర్థిక ఇబ్బందులతో నిలిచిపోయిన ఇంటి నిర్మాణానికి ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ సోమవారం సిమెంటు అందజేశారు. కౌన్సిలర్ బావాండ్ల మంజుల, పట్టణ అధ్యక్షుడు బావాండ్ల మధు విన్నపం మేరకు ఆయన స్పందించారు. సహాయం అందించిన ఉప్పల వెంకటేష్‌కు బాధిత కుటుంబం కృతజ్ఞతలు తెలిపింది. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

వరి పంట పండించవద్దు... జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్

- ప్రత్యామ్నాయ పంటలపై మొగ్గు చూపాలి
- గ్రామసభల్లో ఎల్‌నినో ముప్పుపై అవగాహన

కౌడిపల్లి, నవంబర్ 23 (జనంసాక్షి): భవిష్యత్తులో ఎదురయ్యే వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని మెదక్ జిల్లాలో నీటి వనరుల సంరక్షణ, వరి పంటకు బదులు ఆరుతడి పంటల సాగుపై కౌడిపల్లి మండలం రాజిపేట్ గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఎల్ నినో అవగాహన సదస్సు కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి దేవ్ కుమార్, ఉద్యానవన శాఖ అధికారి ప్రతాప్ సింగ్, డిఎల్‌పిఓ సురేష్ బాబు, మండల ప్రత్యేక అధికారి తాసిల్దార్ కృష్ణ, ఎంపీడీవో శ్రీనివాస్, కలెక్టర్ ప్రతిమ సింగ్, పాల్గొన్నారు.



ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...
ప్రస్తుతం జిల్లాలో ఎల్ నినో ప్రభావం భూగర్భ జలాలు తగ్గుదల వాతావరణ ప్రతికూల ప్రభావ పరిస్థితుల నేపథ్యంలో వరికి బదులుగా ఆరుతడి పంటలపై రైతులు మొగ్గు చూపాలని కలెక్టర్ రైతులకు సూచించారు. పొద్దుతిరుగుడు, నువ్వులు, సెనగ మొదలగు పంటలు తక్కువ నీటితో పండుతాయని తెలిపారు. ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో రైతులు ఆయిల్ ఫామ్ పంట వైపు మొగ్గుచూపాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడిఏ పుణ్యవతి, ఆయా శాఖల అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



పేద విద్యార్థుల ఆశాజ్యోతి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

స్వేరోస్, అంబేద్కర్ యువజన సంఘాల ఆధ్వర్యంలో వేడుకలు

గుండుమాల్, నవంబర్ 23 (జనంసాక్షి): పేద, బహుజన విద్యార్థుల జీవితాల్లో విద్యా వెలుగులు నింపుతూ, సామాజిక న్యాయం కోసం కృషి చేస్తున్న డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ జన్మదిన వేడుకలను సోమవారం గుండుమాల్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వేరోస్, అంబేద్కర్ యువజన సంఘాల నాయకులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.
స్వేరోస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బర్రె కృష్ణయ్య, అంబేద్కర్ యువజన సంఘం గ్రామ అధ్యక్షుడు, వార్డు సభ్యుడు సోలాపురం రమేష్ బాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.
ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఐపీఎస్ అధికారిగా ఉన్నత పదవుల్లో కొనసాగినప్పటికీ, వాటిని వదులుకొని పేద విద్యార్థుల విద్యాభివృద్ధి, బహుజనుల హక్కుల పరిరక్షణ, సామాజిక సమానత్వం కోసం నిరంతరం కృషి చేస్తున్న ప్రవీణ్‌కుమార్ యువతకు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ఆయన ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు ప్రజాసేవలో కొనసాగాలని ఆకాంక్షించారు.



ఈ కార్యక్రమంలో పిరంగి శివయ్య, వేపూర్ రామకృష్ణ, పి.ఎల్లయ్య, నల్లగాళ్ల కృష్ణయ్య, దాసరి వెంకట్ రాములు, దాసరి అనంతయ్య, డబ్బు నర్సిములు, డబ్బు బాలప్ప, మాల తిర్మలయ్య, టోట్ల బాజరయ్య, ఎం.అంజిలయ్య, మాల కళ్యాణ్, సోలాపురం చిన్న వెంకటయ్య, చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

చదువుతోపాటు విజ్ఞానం.. విద్యార్థులకు హైదరాబాద్ యాత్ర!

తాండ్ర సర్పంచ్ కాయితి ఆశాదీప్ రెడ్డి ప్రత్యేక చొరవ

కల్వకుర్తి, నవంబర్ 23 (జనంసాక్షి): తాండ్రప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో విజ్ఞానాన్ని పెంపొందించడంతోపాటు, పుస్తకాల్లో చదివిన అంశాలను ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం కల్పించేందుకు తాండ్ర గ్రామ సర్పంచ్ కాయితి ఆశాదీప్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకున్నారు. గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులందరినీ సోమవారం హైదరాబాద్‌లోని ప్రముఖ సందర్శనీయ ప్రదేశాలకు విహారయాత్రకు తీసుకెళ్లారు.ఈ పర్యటన లో భాగంగా విద్యార్థులు బిర్లా మందిర్, బిర్లా ప్లానిటోరియం, చారిత్రక గోల్కొండ కోట, ఎకో పార్క్‌లను సందర్శించారు.
ఆయా ప్రదేశాల విశిష్టతలు, చారిత్రక నేపథ్యం, శాస్త్రీయ అంశాలను ప్రత్యక్షంగా తెలుసుకునే అవకాశం విద్యార్థులకు లభించింది.తరగతి గదుల్లోని పాఠ్యాంశాలకు అదనంగా క్షేత్రస్థాయి అనుభవం ద్వారా జ్ఞానాన్ని పెంపొందించాలనే ఉద్దేశంతో సర్పంచ్ ఈ పర్యటన ఏర్పాటు చేశారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులందరికీ ఇలాంటి అవకాశం కల్పించడంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. గ్రామాభివృద్ధితోపాటు విద్యార్థుల విద్యా వికాసానికి ప్రాధాన్యతనిస్తూ సర్పంచ్ కాయితి ఆశాదీప్ రెడ్డి చేపట్టిన ఈ కార్యక్రమం తల్లిదండ్రుల ప్రశంసలు అందుకుంది.



క్యాన్సర్ బాధితుడికి ఉప్పల వెంకటేష్ ఆర్థిక సాయం

కల్వకుర్తి, నవంబర్ 23 (జనంసాక్షి): మండలంలోని జీడిపల్లి గ్రామానికి చెందిన ఎడ్ల లక్ష్మయ్య క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ వైద్య ఖర్చులకు ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ స్పందించి చికిత్స కోసం ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కల్పనా కృష్ణయ్య, మాజీ ఉపసర్పంచ్ మహమ్మద్ ఖాజా, సర్పంచ్ యాకాల సుమిత్ర భీమయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆరే వెంకటయ్య మృతి పట్ల ప్రముఖుల నివాళులు



చేర్యాల/మద్దూరు, నవంబర్ 23 (జనంసాక్షి): దూల్మిట్ట మండలం కూటిగల్ గ్రామానికి చెందిన ఆరే వెంకటయ్య (88) మృతి పట్ల కాంగ్రెస్, సీపీఐ, తెలంగాణ ప్రజా ఫ్రంట్ నాయకులు సోమ వారం నివాళులర్పించారు. మాజీ మావోయిస్టు రాష్ట్ర నాయకుడు, కాంగ్రెస్ మండల నాయకుడు ఆరే సాయిలు, సీపీఐ గ్రామ శాఖ కార్యదర్శి ఆరే ఉపేందర్ తండ్రి వెంకటయ్య పార్థివదేహానికి పూలమాలలు వేసి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతు ని తల్లిదండ్రులు నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా స్వాతం త్ర్య పోరాటంలో పాల్గొన్నారని గుర్తుచేసుకున్నారు. ఈ కార్యక్ర మంలో అందె అశోక్, పాకాల వెంకన్న, మారేళ్ల భాస్కర్ రెడ్డి, మంజ మల్లేశం తదితర రాజకీయ, ప్రజాసంఘాల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పాఠశాలకు మైక్ సెట్ అందజేత



మల్దకల్, నవంబర్ 23(జనంసాక్షి): మండల పరిధిలోనిఉలిగేపల్లి ఉలిగేపల్లి గ్రామానికి చెందిన అశ్విని, భీముడు గ్రామంలోని సోమవారం ప్రభుత్వ పాఠశాలకు మైక్ సెట్‌ను అందజేశారు.ఈ సందర్భంగా విద్యార్థులకు పండ్లు పంపిణీ చేసి చిన్నారులతో ఆనందాన్ని పంచుకున్నారు. అలాగే పాఠశాలలో ప్రతిరోజూ నిర్వ హించే ప్రార్థనా కార్యక్రమాలు, సమావేశాలు, సాంస్కృతిక కార్య క్రమాలకు ఉపయోగపడేలా మైక్‌సెట్‌ను బహూకరించడం జరి గింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శాం తన్న, ఉపాధ్యాయులు నాగరాజు పాల్గొన్నారు.

బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలి



గద్వాల, నవంబర్ 23 (జనంసాక్షి): వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలని, భద్రాచలంలో వాల్మీకి ఆలయం నిర్మించా లని కార్పొరేషన్ చైర్మన్ గట్టు తిమ్మప్ప మంత్రి పొంగులేటికి వినతిపత్రం అందించారు. ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి చొరవతో డిమాండ్లను మంత్రుల దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకొని పోలీస్ ఉద్యోగాలు సాధించాలి: ఎస్పీ వినీత్

నారాయణపేట జిల్లా బ్యూరో, నవంబర్ 23 (జనంసాక్షి): పోలీస్ ఎస్ఐ, కానిస్టేబుల్ ఉద్యోగాలకు సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అందిస్తున్న ఉచిత శిక్షణలో భాగంగా సోమవారం జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ అభ్యర్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు.ఈ సంద ర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ ఉద్యోగం సాధించా లనే లక్ష్యంతో ఉన్న అభ్యర్థులు క్రమశిక్షణ, పట్టుదల, సమయపాల నతో నిరంతరం చదవాలని సూచించారు. పోలీస్ శాఖ కల్పిస్తున్న ఉచిత శిక్షణ అవకాశాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకొని రాత పరీక్షలతో పాటు ఫిజికల్ ఈవెంట్స్‌లోనూ ప్రతిభ కనబరచాలని తెలిపారు.నారాయణపేట ఇక వెనుకబడిన జిల్లా అనే పేరు ఉండకూడదు. ఇక్కడి నిరుద్యోగ యువత పోటీ పరీక్షలకు సిద్ధమై పోలీస్ ఉద్యోగాలు సాధించి జిల్లాను అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. శిక్షణ పొందుతున్న అభ్యర్థులం దరూ ఉద్యోగాలు సాధించి తిరిగి నారాయణపేట జిల్లాకే రావాలని, ఉద్యోగా లు పొందిన తర్వాత తమ గ్రామాలు, మండలాల్లోని ఇతర యువతకు స్ఫూర్తిగా నిలిచి వారిని కూడా ఉద్యో గాల వైపుప్రోత్సహించాలని కోరారు.ఉచిత శిక్షణ పొందుతున్న అభ్యర్థులు శిక్షణ నాణ్యత పట్ల సంతృప్తి వ్యక్తం చేస్తూ, ప్రిలిమ్స్‌లో ఉత్తీర్ణత సాధించిన వారికి మెయిన్స్ వరకు శిక్షణ కొనసాగించాలని ఎస్పీని కోరగా, అందుకు ఆయన సానుకూలంగా స్పందించి శిక్షణ అంది స్తామని హామీ ఇచ్చారు. ప్రిలిమ్స్ అనంతరం నిర్వహించే దేహదారుఢ్య పరీక్షలకు ఇప్పటి నుంచే సిద్ధం కావాలని, రాత పరీక్షతో పాటు ఫిజికల్ ఈవెంట్స్‌లోనూ రాణించినప్పుడే పోలీస్ ఉద్యోగం సాధ్యమవుతుందని తెలిపారు.



ఈ ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహణకు కృషి చేసిన డీసీఆర్బీ డీఎస్పీ మహేష్, నారాయణపేట డీఎస్పీ నల్లపు లింగయ్య, సీఐలు, ఎస్ఐలు, అధ్యాపకులను ఎస్పీ అభినందించారు. ట్రైనీ డీఎస్పీలు మాట్లాడుతూ తాము కూడా గతంలో ఇలాగే శిక్షణ పొంది ఈ స్థాయికి చేరుకున్నామని, అభ్యర్థులు పట్టుదలతో చదివి లక్ష్యాన్ని సాధించాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో ట్రైనీ డీఎస్పీలు దైనంపల్లి ప్రవీణ్, బానోతు శ్రీనికేష్ నాయక్, పూజారి అనురాగ్, సీఐ శివశంకర్, ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఫ్యాకల్టీ ఇన్‌చార్జి చారి, అధ్యాపకులు, శిక్షణ అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూర్‌లో
సత్యసాయి 101వ జయంతి వేడుకలు..

- హాజరైన మంత్రి వాకిటి శ్రీహరి



ఆత్మకూర్, నవంబర్ 23 (జనంసాక్షి): ఆత్మకూర్ పట్టణంలో సోమవారం నిర్వహించిన భగవాన్ శ్రీ సత్యసాయి బాబా 101వ జయంతి వేడుకల్లో రాష్ట్ర క్రీడా, పాడి పరిశ్రమాభివృద్ధి, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. సందర్భంగా ఈ సందర్భంగా దేవాలయంలో సత్యసాయి బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మానవ సేవే మాధవ సేవ అని చాటిన సత్యసాయి బాబా బోధనలు నేటి తరానికి ఆదర్శమని మంత్రి పేర్కొన్నారు. విద్యార్థులు వేసిన నాటికలు, కోలాటాలు ఆకట్టుకున్నాయి, ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు,

ఆలయానికి భారీ ఆదాయం



కేటీదొడ్డి, నవంబర్ 23 (జనంసాక్షి): మండలంలోని వెంకటాపురం శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించారు. దేవాదాయ శాఖ గద్వాల డివిజన్ పర్యవేక్షకురాలు వెంకటేశ్వరి ఆధ్వర్యంలో జరిగిన లెక్కింపులో రూ. 9,48,640 నోట్లు, రూ. 1,02,266 నాణేలు కలిపి మొత్తం రూ. 10,50,906 ఆదాయం వచ్చినట్లు ఈఓ ఆర్. పురేందర్ కుమార్ తెలిపారు. బ్రహ్మోత్సవాలకు భక్తుల తాకిడి పెరగడంతో ఆదాయం పెరిగిందని అధికారులు పేర్కొన్నారు.

ఘనంగా ఆర్ఎస్
ప్రవీణ్ కుమార్ జన్మదిన వేడుకలు



పెబ్బేరు, నవంబర్ 23 (జనంసాక్షి): పెబ్బేరు పట్టణంలో బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడు దిలీప్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారం లోకి రావడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వనం రాములు యాదవ్, నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ



అయిజ, నవంబర్ 23 (జనంసాక్షి): అయిజ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బడే సాబ్ యాదవ్ ఆధ్వర్యంలో శనివారం ఉప్పల, పులికల్, ఎక్లాస్పూర్ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి మంజూరైన రూ. 70,000 విలువగల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ నరసింహులు, సర్పంచులు తిమ్మోతి,దేవరాజు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసానే ఇందిరమ్మ బీమా లక్ష్యం



నారాయణపేట, నవంబర్ 23 (జనంసాక్షి): ప్రతి నిరుపేద కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించడమే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం లక్ష్యమని మున్సిపల్ కౌన్సిలర్ సత్యమ్మ, కాంగ్రెస్ డీసీసీ ప్రధాన కార్యదర్శి ఎండీ సలీం తెలిపారు. సోమవారం జిల్లా కేంద్రంలోని అశోక్ నగర్ కమ్యూనిటీ హాల్‌లో 7, 8వ వార్డుల్లో ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికా రెడ్డి ఆదేశాల మేరకు పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుటుంబాన్ని పోషించే వ్యక్తి అనుకోకుండా మరణిస్తే ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా రూ. 5 లక్షల జీవిత బీమా అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించి, అర్హులందరికీ ప్రయోజనాలు అందేలా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు రహమాన్, సౌమ్య, ఆర్పీలు పుష్ప, జ్యోతి, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

అమరచింత నుంచి హైదరాబాద్‌కు ఎక్స్‌ప్రెస్ బస్సు ప్రారంభం



అమరచింత, నవంబర్ 23 (జనంసాక్షి): అమరచింత నుంచి హైదరాబాద్‌కు వయా ఆత్మకూర్, కొత్తకోట మీదుగా నూతన ఎక్స్‌ప్రెస్ బస్సు సర్వీసు ప్రారంభమైంది. గతంలో ఆత్మకూర్ వరకే నడిచే బస్సును అమరచింత డెవలప్‌మెంట్ ఫోరం నాయకుల విజ్ఞప్తి మేరకు అమరచింత వరకు పొడిగించినట్లు వనపర్తి డిపో మేనేజర్ దేవేందర్ గౌడ్ తెలిపారు. వనపర్తిలో ఉదయం 7:45 గంటలకు బయలుదేరి 9:10 గంటలకు అమరచింత చేరుకుంటుందని, తిరిగి 9:30 గంటలకు హైదరాబాద్‌కు బయలుదేరుతుందని పేర్కొన్నారు. బస్సు సౌకర్యం కల్పించడంపై పట్టణ ప్రజలు, ఫోరం నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

ప్రతి కుటుంబానికి భరోసా..
ఇందిరమ్మ బీమా పథకం ప్రారంభం



కొత్తపల్లి, నవంబర్ 23 (జనంసాక్షి): మండలంలోని భూనీడ్ గ్రామ పంచాయతీలో ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్థులకు పథకం ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. సర్పంచ్ పుష్ప శ్రీనివాస్ మాట్లాడుతూ ఆపద సమయంలో బాధిత కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే ఈ పథకం లక్ష్యమన్నారు. అర్హులైన ప్రతి కుటుంబం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సంక్షేమ పథకాల వివరాలను ప్రతి ఇంటికీ చేరవేయడంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోట్ల మహేందర్ రెడ్డి, ఉపసర్పంచ్ వెంకట్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి తిరుపతయ్య, వార్డు సభ్యులు, వీఓ లక్ష్మి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రవీణ్ కుమార్ జన్మదినం సందర్భంగా అన్నదానం



గద్వాల, నవంబర్ 23 (జనంసాక్షి): డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ జన్మదినం సందర్భంగా నల్లకుంట షాదీఖానా వద్ద స్వేరోస్ నెట్‌వర్క్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.డి. రఫీ, గోపాల్ రెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకురాలు పద్మ వెంకటేశ్వర్ రెడ్డి పాల్గొని పేదలకు ఆహారం పంపిణీ చేశారు. పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఇందిరాభీమ
పథకాన్ని ప్రారంభించిన సర్పంచ్



మల్దకల్, నవంబర్ 23 (జనంసాక్షి): మండల పరిధిలోని కుర్తి రావులచెరువు గ్రామంలో సోమవారం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని గ్రామ సర్పంచ్ భగవంతు ప్రారంభించారు. గ్రామంలో ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమా పథకాని రైతుల సమక్షంలో ప్రారంభించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీడీవో ఆంజనేయరెడ్డి,హాజరు కాగాఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ దేవమ్మ,ధర్మన్న పంచాయతీ కార్యదర్శి రాఘవేంద్ర గౌడు వార్డ్ మెంబెర్స్ బసన్ గౌడ్, రవీందర్ రెడ్డి, రాజశేఖర్, జ్యోతి, భాస్కర్ సీనియర్ నాయకులు వెంకటరెడ్డి, బీసన్న,బోయ భగవంతు, వెంకటేష్ గౌడు కృష్ణారెడ్డి,శివారెడ్డి రాముడు, రాజేష్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

కులాలకు అతీతంగా
ఘనంగా ఆంజనేయస్వామి పండుగ



రేవల్లి, నవంబర్ 23 (జనంసాక్షి): వనపర్తి జిల్లా రేవల్లి మండలం తల్పునూరులో ఆంజనేయస్వామి పండుగ, ఆలయ నిర్మాణంపై ఏర్పడిన వివాదం సామరస్యంగా పరిష్కారమైంది. మాదిగ సామాజిక వర్గానికి పండుగ సమాచారం ఇవ్వకుండా, వారిని భాగస్వాములను చేయకపోవడంపై మాదిగ జాగృతి సంఘం అభ్యంతరం వ్యక్తం చేసింది. స్పందించిన దేవాలయ కమిటీ, గ్రామ పెద్దలు సంఘం ప్రతినిధులతో చర్చించి తమ నిర్ణయానికి చింతిస్తూ పండుగలో అందరూ భాగస్వాములు కావాలని కోరారు. కులమత, వర్గ భేదా లకు తావులేకుండా గ్రామస్తులంతా ఐక్యంగా పండుగను ఘనంగా నిర్వహించాలని తీర్మానించారు. ఈ పరిష్కారంపై మాదిగ సామాజిక వర్గం హర్షం వ్యక్తం చేసింది. కార్యక్రమంలో సర్పంచ్ జి. పావని, మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటేష్, మాదిగ జాగృతి సంఘం నాయకులు, అంబేద్కర్ సంఘం ప్రతినిధులు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువ ఇంజనీర్ మృతి.. కుటుంబానికి ఎమ్మెల్యే అండ



వనపర్తి, నవంబర్ 22 (జనంసాక్షి): హైదరాబాద్‌లోని మియాపూర్ వద్ద బస్సు ఢీకొని చిన్నమందడికి చెందిన యువ ఇంజనీర్ జనిగే భరత్ మృతి చెందడంపై ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బీటెక్ పూర్తి చేసి మూడు నెలలుగా సైట్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న భరత్ విధులకు వెళ్తుండగా ప్రమాదానికి గురయ్యాడు. సోమవారం ఎమ్మెల్యే భరత్ నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారికి మనోధైర్యం కల్పిస్తూ తక్షణ సాయంగా రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. కష్టకాలంలో కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

చేతి బావి స్థలం ఆక్రమణకు గురైందని గ్రామస్తులు ఆరోపణ.?

ఎంపీడీవోకు వినతి పత్రం అందజేసిన గ్రామస్తులు



రేగోడు, నవంబర్ 23 (జనంసాక్షి):
రేగోడు మండలం కొండాపూరం గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామ సావిడి వద్ద గతంలో ఉన్న చేతి బావి స్థలం వివాదాస్పదంగా మారింది.
గతంలో గ్రామ ప్రజలందరికీ ఉపయోగపడే విధంగా ఉన్న చేతి బావిని పూర్తిగా తొలగించి, ఆ స్థలానికి అనుకొని గ్రామానికి చెందిన ఒక వ్యక్తి తన ఇంటి నిర్మాణానికి గేటు ఏర్పాటు చేశారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.
ఆ స్థలం గతంలో గ్రామ ప్రజల అవసరాలకు ఉపయోగపడిన స్థలం కావడంతో, ప్రస్తుతం గ్రామ ప్రజలందరూ కలిసి అక్కడ ప్రజల తాగునీటి అవసరాలను తీర్చేందుకు ఆర్వో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు.ఈ విషయమై స్థానిక సర్పంచ్‌ను సంప్రదించి అనుమతి కోరినప్పటికీ,వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు అనుమతి ఇవ్వడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు.
దీంతో గ్రామ ప్రజలందరికీ ఉపయోగపడే ప్రజా ప్రయోజన కార్యక్రమానికి ఆటంకం ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.
ఈ నేపథ్యంలో గ్రామస్తులు ఎంపీడీవోకు వినతి పత్రం అందజేశారు. గ్రామ సావిడి వద్ద గతంలో ఉన్న చేతి బావి స్థలానికి సంబంధించిన రికార్డులను పరిశీలించి,ఆ స్థలం ప్రభుత్వానిదా లేదా గ్రామ పంచాయతీకి సంబంధించినదా అనే విషయంపై విచారణ జరిపించాలని కోరారు.
గ్రామ ప్రజలందరి ఆమోదంతో గ్రామప్రజల తాగునీటి అవసరాల కోసం అదే స్థలంలో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేసుకునేందుకు సంబంధిత అధికారుల ద్వారా స్థల పరిశీలన చేయించి, అవసరమైన అనుమతులు మంజూరు చేయాలని వినతిలో పేర్కొన్నారు.
తమ గ్రామ ప్రజల సమస్యను ప్రజావాణిలో స్వీకరించి తగిన న్యాయం చేయాలని గ్రామస్తులు కోరారు.

పేదల వైద్యానికి సీఎంఆర్ఎఫ్ భరోసా: ఆవుల రాజిరెడ్డి

నర్సాపూర్‌లో 262 మందికి రూ.87 లక్షల ఆర్థిక సాయం పంపిణీ



నర్సాపూర్, నవంబర్ 23 (జనంసాక్షి): పేద, మధ్యతర గతి కుటుంబాలకు అనారోగ్య సమయంలో వైద్య ఖర్చుల భారం తగ్గించి ఆర్థిక భరోసా కల్పించడమే ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ప్రధాన ఉద్దేశమని నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. నర్సాపూర్ పట్టణంలోని శ్రీ సాయికృష్ణ గార్డెన్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో 262 మంది లబ్ధిదారులకు రూ.87 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఆయన పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్య చికిత్సకు అవసరమైన ఖర్చులు భరించలేని పేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ఎంతో ఊరటనిస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రజారోగ్యం, సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ అర్హులకు ఆర్థిక సాయం అందిస్తోందని తెలిపారు.

రూ.8.21 కోట్లకు పైగా సాయం...

2024 నుంచి 2026 వరకు నర్సాపూర్ నియోజకవర్గ పరిధిలో 2,113 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ.8.21 కోట్లకు పైగా ఆర్థిక సాయం అందించినట్లు వెల్లడించారు. అలాగే ఎల్ఓసీ ద్వారా 160 మందికి రూ.7 కోట్ల మేర వైద్య సహాయం అందించినట్లు వివరించారు. సంక్షేమ పథకాల అమలులో అవినీతికి తావులేకుండా పారదర్శకతకు ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. పేదలకు అందాల్సిన సహాయాన్ని దుర్వినియోగం చేయడం సరికాదని, నిధుల వినియోగంలో బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. వైద్య ఖర్చుల కారణంగా ఏ పేద కుటుంబమూ ఇబ్బందులు పడకూడదన్న లక్ష్యంతో అర్హులకు ప్రభుత్వ సాయం కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీరాజు యాదవ్, కౌన్సిలర్లు సుధీర్ గౌడ్, ఇలియాస్, దావుద్, మాజీ ఎంపీపీ లలిత నర్సింగ్ నాయక్, నాయకులు శ్రీనివాస్ గుప్తా, సురేష్ నాయక్, రిజ్వాన్, ఆంజనేయులు గౌడ్, గ్రామ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ పేలుడులో గుడిసె కోల్పోయిన కుటుంబానికి బీజేపీ ఆర్థిక సాయం

బాధితులను పరామర్శించి రూ.10 వేల అందజేత.. ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని ఎంఆర్ఓకు విజ్ఞప్తి



రేవల్లి, నవంబర్ 23 (జనంసాక్షి): మండలంలోని కొత్త బండరావిపాకుల గ్రామంలో శనివారం ఉదయం గ్యాస్ సిలిండర్ పేలడంతో నిరుపేద కుటుంబానికి చెందిన గుడిసె పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో ఇంట్లోని సామగ్రి, బట్టలు, వంట పాత్రలు, ఆహార ధాన్యాలు, బియ్యం, పిల్లల పుస్తకాలు, ఆధార్, రేషన్ కార్డులతో పాటు ఇతర ముఖ్యమైన పత్రాలు కాలిపోయాయి. కుటుంబ సభ్యులు బయటకు రావడంతో ప్రాణనష్టం తప్పినప్పటికీ, ఆ కుటుంబం నిరాశ్రయులైంది.
విషయం తెలుసుకున్న బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షులు, మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయ్యగారి ప్రభాకర్ రెడ్డి సోమవారం గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. కాలిపోయిన గుడిసెను పరిశీలించి, బీజేపీ తరపున రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. బాధితులకు ధైర్యం చెబుతూ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం రేవల్లి ఎంఆర్ఓకు ఫోన్ చేసి బాధిత కుటుంబానికి వెంటనే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెళ్తామని తెలిపారు.
ఈ కార్యక్రమంలో బీజేపీ సర్పంచ్ మేకల కృష్ణయ్య, జిల్లా కౌన్సిల్ సభ్యులు అజయ్ గౌడ్, రాము, మండల ప్రధాన కార్యదర్శి తిరుపతి, దళిత మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యులు జమ్ములు, కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు కేశన్, మోర్చా మండల అధ్యక్షులు కొత్తల జగదీష్ రెడ్డి, మండల కోశాధికారి పవన్, బూత్ అధ్యక్షులు అంజి, మండల కార్యదర్శి కర్ణాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేకుల షెడ్డు పేరుతో నిర్మించిన ఫంక్షన్ హాల్ అనుమతులు రద్దు చేయాలి

కాంప్లెక్స్‌ను సీజ్ చేయండి... లక్షల రూపాయల ప్రభుత్వ ఆదాయానికి గండి



శివ్వంపేట, నవంబర్ 23 (జనంసాక్షి): హెచ్ఎండిఏ పరిధిలో ఫంక్షన్ హాల్ నిర్మించి, ప్రస్తుతం కూడా దాని నిర్వహణను కొనసాగిస్తున్న జావేద్ అనే వ్యక్తి పై చట్టపరమైన చర్యలు తీసుకొని ఫంక్షన్ హాల్ అనుమతులు రద్దు చేస్తూ, అనుమతులు అక్రమంగా మంజూరు చేసిన పంచాయతీ సెక్రెటరీ అహ్మద్ అలీ పై తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తూ మండల కేంద్రమైన శివంపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకులు పులిమామిడి నవీన్ గుప్తా, వారాల గణేష్ లు సోమవారం మండల కేంద్రమైన ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో వెంకట లక్ష్మమ్మను కలిసి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామపంచాయతీ పరిధిలో జావేద్ అనే వ్యక్తి తప్పుడు అనుమతులు తీసుకొని జే కే హాల్ పేరుతో ఫంక్షన్ హాల్ నిర్వహిస్తున్నాడు. ఇతడు అతనికి సంబంధించిన వ్యవసాయ భూమిని సర్వేనంబర్స్ 91, 92, 93 లలో మొత్తం విస్తీర్ణం 67 గుంటల భూమి, అంటే 8107 చదరపు గజములు. జావేద్ అనే వ్యక్తి 11/03/2020 రోజునే గ్రామపంచాయతీ నుండి రేకుల షెడ్డు నిర్మాణం పేరుతో అనుమతులు తీసుకొని, అదే స్థలంలో జే కే ఫంక్షన్ హాల్ నిర్మాణం చేపట్టి, శివ్వంపేట గ్రామపంచాయతీనీ, అలాగే హెచ్ఎండిఏ ని మోసం చేసి ప్రభుత్వానికి చలాన్ల ద్వారా చెల్లించాల్సిన లక్షల రూపాయలు చెల్లించకుండా మోసం చేశాడని వారు ఆరోపించారు. పంచాయతీ రాజ్ యాక్ట్ 2018 ప్రకారం నివాస భవనాలకు, నివాసేతర భవనాలకు, వాణిజ్య సముదాయాలకు టీ జీ - ఐ పాస్ ద్వారా అనుమతులు తీసుకోవాలిసి ఉండగా, గ్రామ పంచాయతీ కార్యదర్శికి 300 చదరపు మీటర్ల కంటే ఎక్కువ అనుమతులు మంజూరు చేసే అధికారం లేదనీ, తెలిసి కూడా అప్పటి పంచాయతీ సెక్రెటరీ అహ్మద్ అలీ అతని దగ్గర లంచాలు తీసుకొని, యజమాని యొక్క అతడి ఒత్తిడికి గురై తన పరిధిని దాటి తేదీ 11/03/2020 రోజున జావేద్ అనే వ్యక్తికి 950.66 చదరపు గజములకు అనుమతులు మంజూరు చేశాడనీ తెలిపారు. వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్పు చేసిన దానికంటే సుమారు నాలుగు నెలల ముందుగానే అనుమతులు మంజూరి చేశాడని చెప్పారు. 8107 చదరపు గజములకు హెచ్ఎండీఏ కు చలానా రూపంలో లక్షల రూపాయలు చెల్లించాల్సి వస్తుందని, జేకే ఫంక్షన్ హాల్ యజమాని జావేద్, పంచాయతీ సెక్రెటరీ మహమ్మద్ అలీ ఇద్దరు కుమ్మక్కై, అనుమతులు పొంది గ్రామ పంచాయతీ, హెచ్ఎండిఏ ను మోసం చేసిన జేకే ఫంక్షన్ హాల్ ఓనర్ జావిద్ ను, అలాగే పంచాయతీ సెక్రెటరీ అయిన అహ్మద్ అలీ పై శాఖాపరంగా చట్టపరమైన చర్యలు తీసుకొవాలన్నారు రేకుల షెడ్డు పేరుతో నిర్వహిస్తున్న ఫంక్షన్ హాల్ అనుమతులు రద్దు చేసీ, హెచ్ఎండిఏ నుండి అధికారికంగా అనుమతులు తీసుకునేవరకు ఫంక్షన్ హాల్ ను సీజ్ చేయవలసిందిగా వారు విజ్ఞప్తి చేశారు.

జి రాంజీ రామ్ ఉపాధి పనులను పరిశీలించిన కేంద్రం కమిటీ సభ్యులు



మల్దకల్, నవంబర్ 23 (జనంసాక్షి): మండల పరిధిలోని మల్దకల్, దాసరపల్లి, నేతివానిపల్లి గ్రామాలలో కేంద్రం బృందం జలసంచాయి జల్ భగీరథ డివ్యూటీ డైరెక్టర్ డి.రూపేష్, అసిస్టెంట్ డైరెక్టర్ సిహెచ్ సంజీవ్ సోమవారం పర్యటించారు. షెడ్యూల్ ప్రకారం తప్పనిసరిగా క్షేత్రస్థాయిలోఅందుబాటులో ఉండాలి.వెరిఫికేషన్ బృందం సందర్శించే గ్రామాల్లో గుర్తించిన పనులకు సంబంధించిన అన్ని రికార్డులు సిద్ధంగా ఉంచుకోవడంతో పాటు, పని ప్రదేశాలను పరిశుభ్రంగా ఉంచి, బృందానికి అవసరమైన సమాచారాన్ని అందించాలి, జి రాంజీ రామ్ ఉపాధి పనులను సభ్యులు తనిఖీలు చేశారు.కేంద్ర బృందం జల సంరక్షణ పనులను పర్యవేక్షించడానికి ఇక్కడికి వచ్చారు.ముందుగా మండల పరిషత్ కార్యాలయంలో చేరుకొని అక్కడ ఎంపీడీవో ఆంజనేయరెడ్డి వారికి స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు.బృందం వెంట ఏపిడి శ్రీనివాస్,ఈసీ రామకృష్ణ,కోఆర్డినేటర్ విద్యాధర్, టిఏలు అనుష, ప్రమీల, ఉమ్మెర, తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగుతో రైతులకు దీర్ఘకాలికంగా లాభాలు

ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలి: ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి





వనపర్తి బ్యూరో, నవంబర్ 22 (జనంసాక్షి): మండలంలోని మంగంపల్లిలో తన సొంత వ్యవసాయ క్షేత్రాన్ని సోమవారం సందర్శించిన శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి, అక్కడ సాగు చేస్తున్న ఆయిల్ పామ్ తోటను పరిశీలించారు.

తోటలో మొక్కల పెరుగుదల, వాటి నిర్వహణ, సంరక్షణ తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

ఈ సందర్భంగా వ్యవసాయ క్షేత్ర సిబ్బందితో మాట్లాడిన ఎమ్మెల్యే, ఆయిల్ పామ్ మొక్కల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, మొక్కల పెరుగుదలకు అవసరమైన చర్యలు చేపట్టడంతో పాటు ఎప్పటికప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుత వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని సంప్రదాయ పంటలకు ప్రత్యామ్నాయంగా ఆయిల్ పామ్ సాగును చేపట్టినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రభుత్వం ఈ పంట సాగుకు ప్రోత్సాహం అందిస్తున్న నేపథ్యంలో రైతులు ఆయిల్ పామ్ సాగుపై అవగాహన పెంచుకోవాలని పిలుపునిచ్చారు.

ఆయిల్ పామ్ సాగు ద్వారా దీర్ఘకాలికంగా మెరుగైన ఆదాయం పొందేందుకు అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. అయితే సరైన యాజమాన్య పద్ధతులు పాటించడం, నీటి నిర్వహణకు ప్రాధాన్యత ఇవ్వడం, మొక్కలను సమర్థవంతంగా సంరక్షించడం ద్వారా ఆశించిన దిగుబడులు, మంచి ఫలితాలు సాధించవచ్చని వివరించారు.

రైతులు సంప్రదాయ పంటల సాగుతో పాటు ఆయిల్ పామ్ వంటి ప్రత్యామ్నాయ పంటల వైపు కూడా దృష్టి సారించాలని, మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకుంటూ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సూచించారు.

నవంబర్ 26న వనపర్తి జిల్లాలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ పర్యటన

రేషన్ షాపులు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో తనిఖీలు



వనపర్తి, నవంబర్ 23(జనంసాక్షి): తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి, కమిషన్ సభ్యులతో కలిసి ఈ నెల 26వ తేదీన వనపర్తి జిల్లాలో పర్యటించనున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి (పీడీ డీఆర్డీఓ) ఉమాదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ నెల 26వ తేదీ గురువారం ఉదయం 9:30 గంటలకు కమిషన్ చైర్మన్, సభ్యులు వనపర్తి పట్టణానికి చేరుకోనున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లాలోని రేషన్ షాపులు, ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను సందర్శించి అక్కడ అందిస్తున్న ఆహార పదార్థాల నాణ్యత, ప్రమాణాలను పరిశీలించనున్నారు.

అదేవిధంగా హెల్త్ కిట్లు, ప్రసూతి ప్రయోజనాల (మెటర్నిటీ బెనిఫిట్స్) అమలుపై కూడా తనిఖీలు నిర్వహించనున్నారు.

క్షేత్రస్థాయి పర్యటన అనంతరం మధ్యాహ్నం 3 గంటలకు ఐడీఓసీ సమావేశ మందిరంలో సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. ఆయా కేంద్రాల్లో అమలవుతున్న ఆహార భద్రత, సంక్షేమ పథకాల తీరును సమీక్షించనున్నారు.

ఈ పర్యటనలో తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డితో పాటు కమిషన్ సభ్యులు వి. ఆనంద్, గోవర్ధన్ రెడ్డి, ఆర్. శారద, ఎం. భారతి, బి. జ్యోతి, బానోత్ సంగులాల్ పాల్గొననున్నట్లు డీఆర్డీఓ ఉమాదేవి వెల్లడించారు.

సంత్ సేవాలాల్

మహారాజ్ సభను విజయవంతం చేయాలి



ఖిల్లా ఘనపురం, నవంబర్ 23 (జనంసాక్షి): ఈ నెల 26న నాగర్‌కర్నూల్ జిల్లా పదరా మండలం మద్దిమడుగు గ్రామ శివారులో సంత్ సేవాలాల్ మహారాజ్ విగ్రహ ప్రతిష్ఠాపనకు రాష్ట్ర ప్రభుత్వం శంకుస్థాపన చేయనుందని దిశ కమిటీ జిల్లా సభ్యులు మూడావత్ రవి నాయక్ తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరుకానున్న ఈ కార్యక్రమంలో రూ.139 కోట్లతో 22 ఎకరాల్లో ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నట్లు పేర్కొన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోని తండాల సర్పంచులు, పూజారులు, మాజీ ప్రజా ప్రతినిధులు, మహిళలు, యువకులు, గిరిజనులు అధిక సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

హైకోర్టు న్యాయవాదిగా

హోదేకర్ అభిలాష్ ప్రమాణ స్వీకారం

- **వనపర్తి జిల్లా యువకుడికి అభినందనల వెల్లువ**



వనపర్తి నవంబర్ 22 (జనంసాక్షి): వనపర్తి జిల్లా కేంద్రానికి చెందిన హోదేకర్ అభిలాష్ హైదరాబాద్ హైకోర్టులో న్యాయవాదిగా ప్రమాణ స్వీకారం చేయడంతో పాటు బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాలో తన పేరును నమోదు చేసుకున్నారు. దీంతో న్యాయవాద వృత్తిలో తన ప్రస్థానాన్ని అధికారికంగా ప్రారంభించారు. హైదరాబాద్‌లోని కేశవ మెమోరియల్ కళాశాలలో విద్యాభ్యాసం పూర్తి చేసిన అభిలాష్, విద్యార్థి దశ నుంచే సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. ఉమ్మడి పాలమూరు హిందూ వాహిని విభాగ్ కన్వీనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ పలు సామాజిక కార్యక్రమాల్లో క్రియాశీలకంగా వ్యవహరించారు.

ఒకవైపు సామాజిక సేవలో తనదైన ముద్ర వేస్తూ, మరోవైపు న్యాయవిద్యను విజయవంతంగా పూర్తి చేసి న్యాయవాదిగా వృత్తి జీవితంలోకి అడుగుపెట్టడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజా సంకల్ప

బలమై సాగుతున్న రేవంత్ రెడ్డి ప్రజాపాలన



జనగామ, నవంబర్ 23 (జనంసాక్షి): తెలంగాణలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ముందుకు సాగుతోంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో కుటుంబ పాలన, అవినీతి, నిరుద్యోగం, రైతులు, కార్మికులు, మహిళలు, బలహీన వర్గాల సమస్యలు నిర్లక్ష్యానికి గురయ్యాయని కాంగ్రెస్ వర్గాలు విమర్శిస్తున్నాయి. కాళేశ్వరం ప్రాజెక్టు, ధరణి, మిషన్ భగీరథ, డబుల్ బెడ్‌రూం ఇళ్ల పథకాల అమలులో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తున్నాయి. విద్య, వైద్యం, ఉద్యోగాల కల్పనలోనూ గత ప్రభుత్వం విఫలమైందని పేర్కొంటున్నాయి.

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాపాలనకు శ్రీకారం చుట్టిందని వ్యాసం పేర్కొంటోంది. పేదల ఆత్మగౌరవం కోసం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తోంది. భూభారతి ద్వారా భూ సమస్యల పరిష్కారం, రేషన్ కార్డుల పంపిణీ, ఉచిత సన్నబియ్యం, నూతన పింఛన్ల మంజూరుకు చర్యలు చేపట్టింది. పేద కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తోంది.

యువతకు ఉపాధి కల్పన, ఖాళీ ఉద్యోగాల భర్తీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు రుణాలు అందించడం, గిరిజన ప్రాంతాల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించింది. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు, వ్యవసాయ యాంత్రీకరణ, సబ్సిడీ యంత్రాల పంపిణీకి చర్యలు తీసుకుంటోంది. రాజీవ్ ఆరోగ్యశ్రీ ద్వారా వైద్య సాయాన్ని రూ.10 లక్షలకు పెంచింది. మహిళా సాధికారత, వృత్తిదారుల సంక్షేమం, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోంది.

అలాగే ఫోర్త్ సిటీ నిర్మాణం, మూసీ సుందరీకరణ, చెరువుల పరిరక్షణకు హైడ్రా చర్యలు, స్కిల్ యూనివర్సిటీల ఏర్పాటు ద్వారా అభివృద్ధికి బాటలు వేస్తోందని వ్యాసం వివరిస్తోంది. రాష్ట్ర హక్కుల కోసం కేంద్రంతో చర్చలు జరుపుతూ, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొంటోంది. ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కొనసాగాలంటే ప్రజాపాలనకు మద్దతుగా నిలవాలని వ్యాస రచయిత పిలుపునిచ్చారు.

మహిళలకు ఉచిత బస్సు.. పురుషులపై చార్జీల భారం!

- **పెంచిన బస్సు చార్జీలు తగ్గించకపోతే రాష్ట్రవ్యాప్త ఆందోళనలు**



మక్తల్, నవంబర్ 23 (జనంసాక్షి): మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నామని చెబుతూ మరోవైపు పురుషులపై బస్సు చార్జీల భారం మోపుతున్నారని నారాయణపేట జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి జి.బలరాం రెడ్డి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు వెంకట రాములు ముదిరాజ్ కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. సోమవారం మక్తల్ పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.

మక్తల్ మండలం జక్లేర్ స్టేజీ నుంచి మక్తల్‌కు కేవలం 13 కిలోమీటర్ల దూరానికి రూ.60 వసూలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. 63 కిలోమీటర్ల మక్తల్--మహబూబ్‌నగర్ మార్గంలో గతంలో రూ.90 ఉన్న టికెట్ ధరను ప్రస్తుతం రూ.120కు పెంచారని తెలిపారు. జక్లేర్ నుంచి మహబూబ్‌నగర్‌కు 50 కిలోమీటర్ల దూరానికి రూ.80 వసూలు చేస్తున్నారని, అధిక చార్జీలతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆదాయ వనరులను పెంచుకోవడంలో విఫలమైన ప్రభుత్వం సామాన్యులపై భారం మోపడం సరికాదన్నారు. ఎన్నికల సమయంలో ప్రకటించిన ఆరు గ్యారెంటీల్లో ఎన్ని అమలు చేశారో ప్రభుత్వం స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేదని చెబుతూనే భారత్ సమ్మిట్ పేరుతో దుబారా ఖర్చులు చేస్తున్నారని విమర్శించారు. ఎల్‌నినో ప్రభావంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. పెంచిన బస్సు చార్జీలను తక్షణమే తగ్గించాలని, పాలన చేతకాకపోతే ముఖ్యమంత్రి పదవి నుంచి దిగిపోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీజేపీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కర్ని స్వామి, మక్తల్ మండల అధ్యక్షుడు ఎం. ప్రతాపరెడ్డి, మైనార్టీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి జావిద్ హుస్సేన్, మాజీ సర్పంచ్ మాదేవమ్మ శంకర్, ఓబీసీ నాయకుడు ఆడెం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మూడు గ్రామాలకు పునరుద్ధరించిన ఆర్టీసీ బస్సు సౌకర్యం



వనపర్తి, నవంబర్ 22 (జనంసాక్షి): ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ప్రత్యేక చొరవతో కరోనా సమయంలో నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు సర్వీసులు మోజర్ల, మద్దిగట్ల, అమ్మపల్లి గ్రామాలకు తిరిగి ప్రారంభమయ్యాయి. దీంతో విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు, వృద్ధులకు ప్రయాణ కష్టాలు తీరనున్నాయి. బస్సు సౌకర్యం పునరుద్ధరణకు కృషి చేసిన ఎమ్మెల్యేకు గ్రామాల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌ను
కలిసిన పిఎసిఎస్ చైర్మన్లు



గద్వాల నడిగడ్డ, నవంబర్ 23 (జనంసాక్షి); గద్వాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారము అలంపూర్ నియోజకవర్గ పరిధిలో ప్రభుత్వం ద్వారా నూతనంగా ఎన్నికైన పిఎసిఎస్ చైర్మన్లు జిల్లా అదనపు కలెక్టర్ గారిని మరియు డిసిఓని మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా వారికి శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా సత్కరించారు.

రాయపల్లిలో భూభారతి రీ సర్వే ప్రారంభం



రాజాపూర్, నవంబర్ 23 (జనంసాక్షి): మండలంలోని రాయపల్లి గ్రామంలో భూభారతి కార్యక్రమంలో భాగంగా చేపట్టనున్న భూముల రీ సర్వేను సోమవారం సర్పంచ్ కిష్టారం గాయత్రి మల్లేష్ గౌడ్ ప్రారంభించారు. గ్రామంలోని భూముల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి భూ రికార్డులను సమగ్రంగా సర్వే చేయనున్నట్లు అధికారులు తెలిపారు. భూ యజమానులు సర్వే అధికారులకు సహకరించి అవసరమైన వివరాలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ భారతి, ఉప సర్పంచ్ ప్రవీణ్ కుమార్ గౌడ్, ఆర్ఐ యాదగిరి, సర్వే అధికారి సత్యనారాయణ, వార్డు సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ స్థులు పాల్గొన్నారు.

బాలికలకు
సైబర్ నేరాలు, డ్రగ్స్‌పై అవగాహన



కొల్చారం, నవంబర్ 23 (జనంసాక్షి):
కొల్చారం కేజీబీవీని సందర్శించిన మెదక్ రూరల్ సీఐ కృష్ణమూర్తి విద్యార్థినులకు సైబర్ నేరాలు, డ్రగ్స్, ట్రాఫిక్ నిబంధనలు, సోషల్ మీడియా వినియోగం, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఉన్నత లక్ష్యాలతో చదువుకోవాలని, సమస్యలుంటే పోలీసులను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ మొహమ్మద్ మొయినుద్దీన్ పాల్గొన్నారు.

ప్రజలకు భద్రత.. రైతులకు భరోసా.. కల్వకుర్తిలో అభివృద్ధి బాట!

- **అగ్నిమాపక కేంద్రం ప్రారంభం..**
- **33 కేవీ విద్యుత్ లైన్ మళ్లింపునకు శంకుస్థాపన..**
- **ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం**



కల్వకుర్తి, నవంబర్ 23 (జనంసాక్షి): కల్వకుర్తి పట్టణ అభివృద్ధికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పలు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.



సోమవారం పట్టణంలో నూతన అగ్నిమాపక కేంద్రాన్ని ప్రారంభించడంతో పాటు 33 కేవీ విద్యుత్ లైన్ మళ్లింపు పనులకు శంకుస్థాపన చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. కల్వ కుర్తి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో పాల్గొన్నారు.

అగ్నిమాపక కేంద్రం ప్రారంభం...

పట్టణంలో నూతనంగా నిర్మించిన అగ్నిమాపక కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో అగ్నిప్రమాదాలు జరిగినప్పుడు సకాలంలో స్పందించి ప్రజలకు సేవలందించేందుకు ఈ కేంద్రం ఉపయోగపడుతుందని తెలిపారు.

విద్యుత్ లైన్ల మళ్లింపునకు శంకుస్థాపన...

విద్యానగర్, తిలక్‌నగర్ ప్రాంతాల్లో నివాస గృహాల మీదుగా వెళ్తున్న 33 కేవీ సిర్సనగండ్ల ఫీడర్ విద్యుత్ లైన్‌ను ప్రత్యామ్నాయ మార్గంలోకి మళ్లించే పనులకు శంకుస్థాపన చేశారు. ఈ పనులు పూర్తయితే స్థానికులకు భద్రతాపరమైన సమస్యలు తొలగుతాయని పేర్కొన్నారు.

రైతులకు కొనుగోలు కేంద్రాలు...

మెప్మా, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన





సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.

పీఏసీఎస్ చైర్మన్‌గా హరీశ్వర్‌రెడ్డి ప్రమాణ స్వీకారం...

కల్వకుర్తి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నూతన చైర్మన్‌గా ఎన్నికైన శ్రీపురం హరీశ్వర్‌రెడ్డి, పాలకవర్గ సభ్యులతో ఎమ్మెల్యే ప్రమాణ స్వీకారం చేయించారు. రైతుల ప్రయోజనాలకు ప్రాధాన్యతనిస్తూ సహకార సంఘం ద్వారా మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, రైతులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

కుచారంలో పౌష్టిక్ ఫుడ్ ఇంక్యుబేషన్ సెంటర్ ప్రారంభం

- **మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం**
- **స్వయం ఉపాధికి కొత్త అవకాశాలు**

తూప్రాన్, నవంబర్ 23 (జనంసాక్షి):
మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం, గ్రామీణ మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించడం, ఆహార శుద్ధి పరిశ్రమల అభివృద్ధి లక్ష్యంగా మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం కుచారంలోని కోవే సంస్థలో పౌష్టిక్ ఫుడ్ ఇంక్యుబేషన్ సెంటర్‌ను ప్రారంభించారు. కోవే ఇండియా ఆధ్వర్యంలో, సెర్ప్ తెలంగాణ సహకారంతో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి శ్రీనివాసరావు ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ యాదగిరి, కోవే ఇండియా డైరెక్టర్ సుమన్ కుమార్, నీరజా రెడ్డి, అధ్యక్షురాలు కల్పనా రావు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు, ముఖ్యంగా ఆహార ఉత్పత్తుల తయారీ రంగంలో రాణించేందుకు ఇటువంటి కేంద్రాలు ఉపయోగపడతాయని తెలిపారు. ప్రతి కోవే సభ్యురాలు ఒక స్వయం సహాయక సంఘం మహిళకు మార్గదర్శకత్వం అందించి, ఆమె వ్యాపార అభివృద్ధికి సహకరించాలని డీఆర్డీఓ శ్రీనివాసరావు కోరారు. ప్రభుత్వ పథకాలు, ఎంఎస్ఎంఈ అభివృద్ధి కార్యక్రమాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని డీఐసీ జనరల్ మేనేజర్ యాదగిరి సూచించారు.



ఈ కేంద్రం ద్వారా స్వయం సహాయక సంఘాల మహిళలకు ఆహార ఉత్పత్తుల తయారీ, పరిశుభ్రత, నాణ్యత ప్రమాణాలు, అనుమతులు, ప్యాకింగ్, బ్రాండింగ్, మార్కెటింగ్, వ్యాపార నిర్వహణలో శిక్షణ అందించనున్నారు. చిరుధాన్యాలు, సంప్రదాయ పోషకాహార ఉత్పత్తులు, రెడీ టు ఈట్ (ఆజు), రెడీ టు కుక్ (ఆజ) ఆహార పదార్థాల తయారీని ప్రోత్సహించనున్నారు. ఆధునిక యంత్రాలు, సాంకేతిక పరిజ్ఞానం, మార్కెట్ అనుసంధాన సదుపాయాలు కల్పించనున్నారు.



ఆహార పరిశ్రమలు, పరిశోధనా సంస్థలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, ముడిసరుకు సరఫరాదారులు, రిటైలర్లు, బ్యాంకులు, ఆర్థిక సంస్థలతో మహిళా వ్యాపారవేత్తలను అనుసంధానించనున్నారు. సీఏస్ఆర్ సంస్థలు, కార్పొరేట్ సంస్థలు, బ్యాంకులు భాగ స్వాములై శిక్షణ, మౌలిక సదుపాయాలు, మార్కెటింగ్‌కు సహకరించాలని నిర్వాహకులు కోరారు. గ్రామీణ మహిళలను విజయవంతమైన పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్ది, స్థిరమైన ఉపాధి అవకాశాలు కల్పించడమే ఈ కేంద్రం ప్రధాన లక్ష్యమని తెలిపారు.

క్రిస్మస్ సందర్భంగా చర్చిలకు రూ.30 వేల ఆర్థికసాయం

- **నవంబర్ 30లోగా దరఖాస్తు చేసుకోవాలి: సయ్యద్ అక్బర్ పాషా**



గద్వాల నడిగడ్డ, నవంబర్ 23 (జనంసాక్షి): క్రిస్మస్ పండుగ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం అర్హత కలిగిన చర్చిలకు రూ.30 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించనున్నట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి సయ్యద్ అక్బర్ పాషా తెలిపారు. చర్చిలకు సున్నం వేయడం, విద్యుత్ దీపాలంకరణ పనుల కోసం ఈ నిధులు కేటాయించనున్నట్లు సోమవారం ఒక ప్రకటనలో వెల్లడించారు.

సొసైటీస్ రిజిస్ట్రేషన్ లేదా ట్రస్ట్ చట్టం కింద నమోదై, క్రమం తప్పకుండా ప్రార్థనలు నిర్వహించే చర్చిలు అర్హులని పేర్కొన్నారు. చర్చి నిర్వహణ కమిటీ, చెల్లుబాటు అయ్యే రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్ తప్పనిసరిగా ఉండాలన్నారు. ఒక్కో చర్చి నుంచి ఒక దరఖాస్తు మాత్రమే స్వీకరిస్తామని తెలిపారు.

అర్హులైన వారు ఈ నెల 30లోగా tgobmms.cgg.gov.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు ప్రింట్‌తో పాటు రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, కమిటీ తీర్మానం, బ్యాంకు పాస్‌బుక్ లేదా క్యాన్సిల్డ్ చెక్కు, పాస్టర్, అధ్యక్షుడు, కార్యదర్శి ఆధార్ ప్రతులు, చర్చి ఫొటోలు జతచేసి జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ కార్యాలయం, ఐడీఓసీ కాంప్లెక్స్‌లోని ఎఫ్8 గదిలో సమర్పించాలని కోరారు. నిధులను నిర్దేశిత పనులకే వినియోగిస్తామని అండర్‌టేకింగ్ ఇవ్వాలన్నారు.

కార్తీకం.. కమనీయం.. నేడు కార్తీక పౌర్ణమి దీపోత్సవం

జడ్చర్ల, నవంబర్ 23 (జనంసాక్షి):
కార్తీక పౌర్ణమి సందర్భంగా మంగళవారం శైవ, వైష్ణవ ఆలయాల్లో దీపోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. పండుగ నేపథ్యంలో ఉసిరి కొమ్మలు, కాయలు, నోము కుండలు, ప్రమిదలు, వత్తులు, పూజా సామగ్రి కొనుగోళ్లు జోరుగా సాగాయి.



కార్తీక పౌర్ణమి రోజున శివకేశవుల పూజతో పాటు జ్వాలాతోరణం వెలిగించడం సంప్రదాయంగా వస్తోంది. భక్తులు తెల్లవారుజామున స్నానాలు ఆచరించి తులసి కోట వద్ద ఉసిరి కొమ్మను నాటి 365 వత్తులతో దీపారాధన చేస్తారు. సాయంత్రం ఆలయాల్లో నేతి దీపాలు, ఉసిరి దీపాలు వెలిగించి జ్వాలాతోరణం నిర్వహించనున్నారు.